ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 20, ఫిబ్రవరి 2025



రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దుదామని ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి కొల్లు, పక్కన మరో మంత్రి డోలా, ప్రజాప్రతినిధులు, అధికారులు

నవ సమాజానికి నాంది

నవోదయం



డప్పు కొడుతున్న కళాకారిణి

- నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం
- మంత్రులు కొల్లు రవీంద్ర, స్వామి పిలుపు
- ఒంగోలులో నవోదయం 2.0 ప్రారంభం
- విద్యార్థులతో నగరంలో భారీ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు
- ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మానవహారం

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నవసమాజానికి నాంది నవోదయం అని ఎక్సైజ్, గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం నవోదయం 2.0 రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి స్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ దేశానికి యువత అత్యుత్తమమైన సంపద అని తెలిపారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పేదలు నాటుసారా తాగి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారన్నారు. యువకులు డ్రగ్స్, గంజాయిలాంటి మత్తుకు బానిసలై వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసమే నాటుసారాను రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకున్నదన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు ఈగల్ అనే వ్యవస్థను రూపొందించిందన్నారు. రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎక్సైజ్ కమిషనర్

మిగతా 6వ పేజీలో



పావురాళ్లు, బెలూన్‌లను గాలిలోకి వదిలి నవోదయం 2.0ను ప్రారంభిస్తున్న మంత్రులు కొల్లు, డోలా, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, కందుల, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్ తదితరులు

ఒంగోలులో ప్రారంభిస్తే విజయం ఖాయం

నవోదయం కార్యక్రమాన్ని ఒంగోలులో ప్రారంభించడానికి ఒక ప్రత్యేకత ఉందని మంత్రి రవీంద్ర చెప్పారు. ఇక్కడ ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతమవుతున్నదని, అందుకు మహానాడు ఉదాహరణ అన్నారు. ఒంగోలులో ఆ కార్యక్రమ సక్సెస్‌తోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. మంత్రి స్వామి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మారుమూల ప్రాంతాలు, కళాశాలల్లో డ్రగ్స్ దొరికిన చరిత్ర ఉందన్నారు. ఈ పరిస్థితులను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగం ఆ వైపు దృష్టిసారించాలని కోరారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు కావద్దని హితవు పలికారు. మీపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయవద్దని కోరారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ పశ్చిమప్రాంతంలోని గిరిజన ప్రాంతాలలో నాటుసారా తయారీని నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ సారా వలన కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులు గుర్తించాలని, అవగాహన కలిగి ఉండాలన్నారు. దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ యువత నాటుసారా, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

రమణీయం.. వేణుగోపాలుడి రథోత్సవం

హరేకృష్ణ నామస్మరణతో తర్లుపాడు బుధవారం మార్మోగింది. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రథోత్సవం రమణీయంగా సాగింది. వేలాది మంది భక్తులు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకొని పులకించిపోయారు. కొందరు రథం లాగేందుకు పోటీపడ్డారు.

7



24న పీఎం కిసాన్ నిధులు విడుదల

జిల్లాలో 2.48 లక్షల మంది రైతులకు రూ.49.51 కోట్లు



ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు బాసటగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిని ఈనెల 24వతేదీన రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏడాదికి మూడు విడతలుగా ఒక్కో దఫా రూ.2వేలను జమ చేస్తోంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 19 విడతలుగా నగదును ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మూడో విడత నగదు జమను ఈనెల 24న చేయనుంది. జిల్లాలో 2.48లక్షల మంది రైతులు పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అందుకు సంబంధించి ఒక్కో రైతు ఖాతాలో రూ.2వేల చొప్పున జిల్లాకు రూ.49.51 కోట్లు జమ కానున్నాయి.



ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు జనార్దన్, పక్కన ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరాన్ని పట్టించుకున్నారా?

- ఓఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- ప్రతిపక్ష కార్పొరేటర్ ఓవర్ యాక్షన్‌పై సీరియస్
- ఆదాయం రూ.210.80 కోట్లు.. వ్యయం రూ.196.82 కోట్లతో బడ్జెట్
- ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

7



తల్లీబిడ్డ మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై అజయ్‌బాబు (ఇన్‌సెట్‌లో) తల్లి సుజాత (ఫైల్)



అయ్యో పాపం

- మానసిక సమస్యతో తల్లి అఘాయిత్యం
- బిడ్డతో సహా చెరువులో దూకి ఆత్మహత్య

సంతనూతలపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ తల్లి తన తొమ్మిది నెలల పాపతోసహా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని సంతనూతలపాడులో బుధవారం వెలుగు చూసింది. ఎస్ఐ వి.అజయ్‌బాబు కథనం మేరకు.. సంతనూతలపాడులోని బాపట్ల బజారుకు చెందిన బాపట్ల వెంకటేష్‌కు, కొనగానివారిపాలెం చెందిన పట్టీ లక్ష్మయ్య కూమార్తె సుజాత(26)ను ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి యశ్విజ్ఞ(9నెలలు) పాప ఉంది. ఇటీవల వరకు బాగానే ఉన్నా రెండు నెలల నుంచి సుజాత మానసిక సమస్యతో ఇబ్బందిపడుతోంది. దీనికి సంబంధించి చికిత్స పొందుతోంది. కాగా 10 రోజుల క్రితం సుజాత తన బిడ్డను తీసుకుని మంగమూరు వైపు వెళ్లగా.. భర్త, తల్లిదండ్రులు వెతికి పట్టుకుని ఇంటికి తీసుకొచ్చారు. మరోసారి మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి పాపను తీసుకుని వెళ్లిపోయింది. భర్త వెంకటేష్, బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో ఆమె ఆచూకీ కోసం రాత్రంతా విచారించారు. అయితే బుధవారం తెల్లవారుజామున చెరువులో పాప మృతదేహం తేలియాడుతుడటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ అజయ్‌బాబు గజ ఈతగాళ్లతో వెతికించగా ఉదయం 8 గంటలకు సుజాత మృతదేహం లభ్యమైంది. దీంతో సుజాత తన పాపతో సహా మంగళవారం సాయంత్రమే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌బాబు తెలిపారు.

వెలుగు పీడీగా నారాయణ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వెలుగు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను కలిసి బొకే ఇస్తున్న వెలుగు పీడీ నారాయణ

ఆయన మూడు రోజుల క్రితం ఇక్కడ వెలుగు పీడీగా నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఇక్కడ పీడీగా పనిచేసిన వసుంధర శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిల పాలన సాగింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం నారాయణ కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.



మర్లపాడులో రైతు గుర్తింపు కార్డు నమోదును పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

రైతుకు విశిష్ట గుర్తింపు



- పథకాలన్నింటికీ అదే కీలకం
- జిల్లాలో 4.79 లక్షల మంది రైతులు
- అందులో పీఎం కిసాన్ లబ్ధిదారులు 2.49 లక్షల మంది
- ఆర్ఎస్‌కేలలో ఇప్పటికే లక్ష మంది వివరాలు నమోదు

ఆధార్ తరహాలో 11 అంకెలతో కార్డు

ఒంగోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అన్ని అవసరాలకు ప్రధాన గుర్తింపు కార్డుగా ప్రస్తుతం చెలామణిలో ఉన్న ఆధార్ తరహాలో ఇక నుంచి ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి కానుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల లబ్ధికి ఈ కార్డు ప్రామాణికం కానుంది. భూమి ఉండి, పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతూ గుర్తింపు కార్డు తీసుకోవడం తప్పనిసరి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అనుసంధానం, ఆధునికీకరణ చర్యలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో దాదాపు నెలరోజులుగా ఇందుకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి దీనిపై అవగాహన కల్పించారు. ఈనెల 10 నుంచి గుర్తింపు కార్డుల కోసం వివరాలను నమోదు చేస్తున్నారు. ఈనెల 25తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 6.05లక్షల హెక్టార్ల సాగు భూమి ఉండగా 4.79లక్షల మందికిపైగా రైతులు ఉన్నట్లు అంచనా. అందులో 2.49 లక్షల మంది కేంద్రప్రభుత్వం అందజేసే పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు ఉన్నారు.

వేగంగా నమోదు ప్రక్రియ

త్వరలో ఈవిడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో పడనుండగా వారు తక్షణం ఈ గుర్తింపు కార్డులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 38 మండలాల్లో ఉన్న 616 రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే)లో గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను చేపట్టారు. ఇప్పటికే లక్ష మంది రైతులకుపైగా వివరాలను నమోదు చేసుకున్నారు. కాగా సొంత పొలం ఉన్న ప్రతి రైతూ తమ ప్రాంతానికి చెందిన రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకలును

మిగతా 6వ పేజీలో

నవ సమాజానికి నాంది 'నవోదయం'

(5వ పేజీ తరువాయి)

నిశాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మలు మాట్లాడుతూ నవోదయం ప్రాధాన్యతలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నాటుసారా, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వీటికి బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కోరారు. జిల్లాను నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నాటుసారా తాగి అనారోగ్యం పాలై అనేక కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. డ్రగ్స్‌కు తెలియని వయస్సులో యువత బానిసలై తమ ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. నాటుసారా తయారీదారులు, గంజాయి, డ్రగ్స్ విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నా, డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నా టోల్‌ఫ్రీ నంబర్లు 1972, 14405లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గంజాయికి బానిసలై కుటుంబాలకు దూరమయ్యాం

గుంటూరుకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థులు, భరత్ అనే పెయింటర్ మాట్లాడుతూ తాము గంజాయికి బానిసలై కుటుంబాలకు దూరకావడంతోపాటుగా ఆరోగ్యం దెబ్బతిందని సభలో వివరించారు. గుంటూరులో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సీఐ లత తమను కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా మామూలు మనుషులను చేశారని చెప్పారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయిలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ముఖ్యంగా అలాంటి అలవాట్లు ఉన్న స్నేహితులకు దూరంగా ఉండాలని కోరారు.

నగరంలో భారీ ర్యాలీ

నవోదయం 2.0 కార్యక్రమ ప్రారంభం అనంతరం నగరంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయం వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు పావురాలు, బెలూన్లను వేగురవేశారు. నాటుసారా, మత్తుపదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలను తెలియజేసే ప్రత్యేక గీతాన్ని రాసిన కడప జిల్లా ఏఈఎస్ వినోద్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సత్కరించారు. ప్రత్యేక గీతాన్ని, పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్పీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఈఎస్ ఖాజామొహిద్దీన్, ఏఈఎస్‌లు దాసరి బాలయ్య, ఎర్రా వెంకట్, సీఐలు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డులు

(5వ పేజీ తరువాయి)

అందజేయాలి. ఆధార్‌తో అనుసంధానమైన ఉన్న మొబైల్ ఫోన్ కూడా తీసుకెళ్లి వివరాల నమోదు అనంతరం ఓటీపీ తెలియజేసి విశిష్ట గుర్తింపు కార్డును పొందాల్సి ఉంటుంది. రైతులందరూ తమ వివరాలను ఆర్‌ఎస్‌కేలలో తెలియజేసి గుర్తింపుకార్డులు పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో) శ్రీనివాసరావు కోరారు. ఆయా ప్రాంతాల్లో ఈ ప్రక్రియను సీనియర్ వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం టంగుటూరు మండలం మర్లపాడు, సింగరాయకొండ మండలం కలికివాయ గ్రామాల్లో ఈ నమోదు ప్రక్రియను డీఏవో శ్రీనివాసరావు పరిశీలించారు బుధవారం నాగులుప్పలపాడు మండలంలోని పలు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమంలో భాగంగా పర్యటించిన ఆయన గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వివరాల నమోదు, గుర్తింపు కార్డులు పొందేందుకు ఈనెల 25 తుది గడువు అని డీఏవో తెలిపారు.

మహిళల భద్రత కోసం హెల్ప్‌డెస్క్‌లు

● ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. బుధవారం ఒంగోలులోని పోలీస్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన మహిళ పోలీస్ సిబ్బంది అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళల భద్రత మనందరి బాధ్యతని చెప్పారు. మహిళలు, చిన్నపిల్లల కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. జిల్లాలోని ప్రతిఒక్క పోలీస్‌స్టేషన్‌లో మహిళా సహాక కేంద్రాలను ఏర్పాటు చేశామని, స్టేషన్‌కు వచ్చిన మహిళలను మర్యాదగా, గౌరవంగా మాట్లాడాలని ఎస్పీ హితవు పలికారు. వారు ఇచ్చే ఫిర్యాదులను సావధానంగా పరిశీలించి, వారి సమస్యలను ఓపికగా వినాలని ఆయన చెప్పారు. అనంతరం పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ న్యాయాధికారి
కోర్టు పరిధిలోకి ఐదు మండలాలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు పరిధిలోని ఐదు మండలాలను చేర్చారు. ఈమేరకు హైకోర్టు నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల సింగరాయకొండకు కోర్టు మంజూరైంది. భవనం కోసం మండల కాంప్లెక్స్‌లోని గ్రామ సచివాలయాన్ని కేటాయించారు. దాని మరమ్మతులు కూడా పూర్తికావచ్చాయి. ఈనేపథ్యంలో కోర్టు పరిధిలోకి సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు, టంగుటూరు మండలాలను చేర్చారు. దీంతో మండలంలోని న్యాయవాదులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

వీఆర్వోల సంఘం డైరీ కలెక్టర్



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) సంఘం జిల్లా డైరీని, క్యాలెండర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం కలెక్టర్ అన్సారియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వైపీ.రంగయ్య, ఏసీహెచ్.ఆదిరెడ్డిలు జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.జానయ్య, రవికుమార్, ఎ.వెంకట్రామయ్య, నాసర్‌వలి, ఎస్‌కే.యస్థాని, ఎం.సురేష్, జి.వెంకటరెడ్డి, బి.మహేంద్రరెడ్డి, ఎస్.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో
ఉపాధ్యాయురాలు

● రూ. 3.57 లక్షలు పోగొట్టుకున్న వైనం

ముండ్లమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీగా పని చేస్తున్న పోలూరి వెంకటసుజాత అనే ఉపాధ్యాయురాలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఏకంగా రూ. 3.57 లక్షలు పోగొట్టుకున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మారెళ్ళలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న వెంకట సుజాత మంగళవారం ఉదయం పాఠశాలకు విధులకు హాజరైంది. బ్యాగ్ పక్కనే పెట్టి అందులో సెల్‌ఫోన్ పెట్టి ప్రీ ఫైనల్ ఎగ్జామ్ డ్యూటీలో ఉండగా 10:36 గంటలకు వరుసగా మెసేజీలు వచ్చాయి. దీంతో ఆమె ఎవరో మెసేజ్ చేశారని భావించి ఆమెసేజ్ చదువుతుండగా ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు నెట్ బ్యాంకింగ్‌లోకి వచ్చి మొదటి రూ . 1,99,900, రెండవ సారి 1,32,000, మూడవ సారి రూ. 25వేలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఆ తరువాత ఉపాధ్యాయురాలు వెంకట సుజాత ఫోన్‌పేలోకి వెళ్లి బ్యాలెన్స్‌ను చూసుకోగా తన ఖాతాలో ఉన్న రూ. 3.57 లక్షలు లేక పోవటం, జీరో బ్యాలెన్స్ చూపించటంతో కంగారు పడిన సుజాత వెంటనే మారెళ్ళలోని కెనరా బ్యాంక్‌కు వెళ్లి తన ఎకౌంట్‌ను పరిశీలించగా సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో నెట్ బ్యాంకింగ్‌లో వచ్చి డబ్బులు కాజేసినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బు పోగొట్టుకున్న బాధితురాలు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయం తెలిపింది. సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు కూలీలకు విద్యుత్‌షాక్

- తీవ్రగాయాలు కావడంతో గుంటూరు ఆసుపత్రికి తరలింపు
- చీమకుర్తిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఘటన
- అపార్ట్‌మెంట్ నిర్మాణంలో నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న కూలీలు

చీమకుర్తి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ భవనంపై పనిచేస్తున్న ఇద్దరు కూలీలు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. భవనంపై నుంచి ఇనుపరాడ్లను తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు భవనం పక్కనుంచి వెళ్తున్న విద్యుత్ హైటెన్షన్ తీగలకు తగలటంతో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు షాక్‌కు గురై తీవ్రగాయలపాలయ్యారు. దర్శికి చెందిన జి.నరేష్, జి.కోటేశ్వరరావులుగా గుర్తించారు. వీరిని 108వాహనంలో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రులను గుంటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తున్నది. విద్యుత్‌శాఖాధికారులు నిర్మాణంలో ఉన్న భవనాన్ని, పక్కనుంచి వెళ్తున్న హైటెన్షన్ తీగలను పరిశీలించారు. భవనానికి దాదాపు ఎనిమిదిమీటర్ల దూరంలో తీగలు ఉన్నట్లు గుర్తించారు. అయితే మున్సిపల్ కార్యాలయం ఎదుటే నిబంధనలను ఉల్లంఘించి అపార్ట్‌మెంట్ నిర్మాణపనులు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు మౌనముద్ర దాల్చటం పలు అనుమానాలకు తావిస్తున్నది. కనీసం ప్రమాదం జరిగిన తరువాతైనా పట్టించుకోకపోవటం గమనార్హం. కాగా ఈ ఘటనలపై నిర్మాణదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారని, ఇంకా కేసు నమోదు చేయలేదని సీఐ సుబ్బారావు తెలిపారు.



బోయలపల్లి గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



డ్రగ్స్‌తో వచ్చే అనర్థాలపై గంగాపాలెం ఎలకచెట్లు వద్ద ఫ్లెక్సీ

ప్రమాదాల నివారణకు ప్రచారం

● ఎస్పీ అదేశాలతో ఫ్లెక్సీల ఏర్పాటు ● హెల్మెట్ వాడకంపై అవగాహన... చలనాల విధింపు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న సమయంలో ప్రమాదాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. వాటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చెబుతోంది. అందులో భాగంగా ఎస్పీ దామోదర్ ఆదేశాలతో కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనదారులకు ఎక్కడికక్కడ పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా ఎర్రగొండపాలెం పోలీస్ సర్కిల్ పరిధిలో సీఐ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య.. పోలీస్ సిబ్బందితో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు తనిఖీ చేయడం లైసెన్సు, వాహనాల పత్రాలు తదితర వాటిని పరిశీలించి అవగాహన కల్పిస్తూన్నారు. లైసెన్సు, హెల్మెట్, మద్యం తాగి వాహనం నడుపుతున్న వారికి చలానా విధిస్తున్నారు.

ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు

పుల్లలచెరువు, మాచర్ల, మార్కాపురం, త్రిపురాంతకం ప్రాంతాల్లోని జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, అవగాహన కలిగిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'హెల్మెట్ భారం కాదు బాధ్యత'.. 'డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయి' అని కొటేషన్లతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో వాహనదారుల్లో కొంతమేర మార్పు వస్తుందని పోలీసులు చెబుతున్నారు. వీటితో పాటు ఆటో, ట్రాలీ వాహనాల్లో ఎక్కువ సంఖ్యలో కూలీలను ఎక్కించొద్దని, ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఈ తరహాలో ఎన్నడు అవగాహన కల్పించలేదని వాహనదారులు అంటున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, వారు ఎలా ప్రజలపై వల వేస్తారో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కలిగేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విశేషం.

● వాహనదారుల్లో మార్పు రావాలి



హెల్మెట్ వాడాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని ప్రతి ఒక్కరూ ఎవరికి వారే నిర్ణయం తీసుకోవాలి. వాహనదారులకు హెల్మెట్ వల్ల కలిగే లాభాలను, మద్యం తాగి వాహనం నడిపితే జరిగే నష్టాలను రోజూ వివరిస్తున్నాం. ఎస్పీ, సీఐ అదేశాలతో అవగాహన కల్పిస్తున్నాం.

- ఎస్సై పి.చౌడయ్య

కూలీల ఆటోను ఢీకొన్న స్కూల్ బస్సు

ఆటోడ్రైవర్ సహా ఆరుగురికి గాయాలు



క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై వెంకటరావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఢీకొని ఐదుగురు మహిళలు, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఇంకొల్లుకు చెందిన సుమారు 8 మంది మహిళ వ్యవసాయ కూలీలు బుధవారం ఉదయం కేశవరప్పాడులో వ్యవసాయ కూలి పనులకు ఆటోలో వెళుతున్నారు. ఈక్రమంలో మార్గ మధ్యలో జరుబులవారిపాలెం బ్రిడ్జి సమీపంలో ఆటోకు ఎదురుగా స్కూల్ బస్ వస్తుంది. ఆప్రాంతంలో మార్జిన్ తక్కువగా ఉండడంతో అప్పటికే గ్రహించిన ఆటో డ్రైవర్ కోటేశ్వరరావు ఆటోను కొంచెం రోడ్డు పక్కకు నిలిపాడు. అయినా వేగం నియంత్రణ చేసుకోకుండా స్కూల్ బస్ వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న స్వప్న, శిరీష, బుల్లెమ్మాయి, భారతి, రుక్సానాతో సహా ఆటో డ్రైవర్ గాయపడ్డారు. దీంతో స్థానికులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో కొందరు స్వల్పంగా మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న కారంచేడు ఎస్సై వెంకటరావు హాస్పిటల్‌కు చేరుకుని క్షతగాత్రుల నుంచి సంఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు భవితకు సోపానాలు



కడవకుదురు పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు బాలల భవితకు సోపానాలని ఎంఈవో-1 అజయ్‌బాబు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జ్ఞాన జ్యోతి మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, సౌందర్య - సాంస్కృతిక అభివృద్ధిపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడంపై హెచ్‌ఎం, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ల కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మెరుగైన బోధనను అందిస్తామనే నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించినపుడే కేంద్రాలలో చిన్నారుల సంఖ్య పెరుగుతుందని ఎఫ్ఎల్ఎన్ జిల్లా కోఆర్డినేటర్ సుభాని అన్నారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కేంద్రాన్ని బుధవారం సుభాని సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, రిసోర్‌పర్సన్‌లు వంశీకృష్ణ, శీనివాసరావు, వెంకట్రామయ్య, దీపాదేవి పాల్గొన్నారు.

మార్టూరు : చిన్నపిల్లలకు ఆటపాటలతో కూడిన చదువును నేర్పాలని అంగన్‌వాడీ టీచర్లను ఎంఈవో వస్రాంనాయక్ కోరారు. బుధవారం మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రామాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను సందర్శించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు బి రాంబాబు, యెహోషువ, సీఆర్పీలు శ్రీనివాస్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

పర్చూరు : పిల్లల్లో అభ్యసననా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జ్ఞాన జ్యోతి శిక్షణ లక్ష్యమని శిక్షకుడు బాల కోటేశ్వరరావు అన్నారు. మండలం, చెరుకూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల శిక్షణ తరగతులు రెండో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణను కార్యకర్తలు వినియోగించుకోవాలని బాలకోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

26న కొండాయపాలెంలో మహా రుద్రాభిషేకం

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని 26వ తేదీన మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో ఉన్న గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయం వద్ద మట్టి శివలింగానికి రుద్రాభిషేకం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న డీఎల్పీవో హనుమంతరావు

పీసీపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వంలో పనులు చేయకుండానే అక్రమంగా నిధులు స్వాహా చేశారని పంచాయతీకి చెందిన కొందరు వార్డు మెంబర్లు, స్థానికులు స్పందనలో ఇటీవల కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్పీవో హనుమంతరావు బుధవారం విచారణ చేపట్టారు. పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఖర్చుచేసిన వివరాల రికార్డును పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి క్షేత్రస్థాయిలో పనులు జరిగినట్లు చెప్తున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. తరువాత సచివాలయంలో ఫిర్యాదుదారులతో కలిసి పలు రికార్డులను పరిశీలించారు. అయితే ఈ విచారణకు సర్పంచ్ హాజరుకాలేదు. ఆమె సమీప బంధువు మోహన్ అనే వ్యక్తి హాజరయ్యాడు. కాగా పాలకేంద్రం నిర్మించకుండానే గతంలో 2,12,690రూపాయలు అడ్వాన్స్ పేరుతో తీసుకున్న నగదును నిధుల దుర్వినియోగంపై విచారణ చేసేందుకు డీఎల్పీవో వస్తున్నాడన్న విషయం తెలుసుకున్న వైసీపీ నాయకుడు డ్రా చేసిన నిధుల మొత్తాన్ని ఈనెల 15వ తేదీన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఖాతాకు జమ చేసినట్లు తెలిసింది.

అర్ధంతరంగా నిలిచిన విచారణ

పీసీపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని అందిన ఫిర్యాదు మేరకు డీఎల్పీవో చేపట్టిన విచారణ వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య జరిగిన వాగ్వాదంతో అర్ధంతరంగా నిలిచింది.క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన డీఎల్పీవో పంచాయతీ అధికారులతో కలిసి స్థానిక సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తూ విచారణ చేపట్టారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన వైసీపీ మండల కన్వీనర్ బొర్రారెడ్డి పంచాయతీలో ఎటువంటి అవినీతి జరగలేదని చెప్తున్న క్రమంలో అవినీతి జరగలేదని నువ్వు ఎలా చెప్తావని టీడీపీ నాయకుడు లింగారెడ్డి ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురు ఘర్షణ పడుతుండడంతో విచారణను డీఎల్పీవో నిలిపివేశారు.పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఫిర్యాదుపై చేపట్టిన విచారణలో ఏం గుర్తించారని ఆంధ్రజ్యోతి డీఎల్పీవోను అడుగగా విచారణ ఇంకా పూర్తికాలేదని, పూర్తికాగానే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన చెప్పారు.

స్త్రీనిధి పొదుపు ఖాతా నుంచి
రుణాల రికవరీ చేపట్టాలి

● డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ అంబేద్కర్



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ అంబేద్కర్

కనిగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాల రికవరీని పొదుపు ఖాతాల నుంచి చేపట్టేలా బ్యాంకర్లు సహకరించాలని డీఆర్‌డీఏ కనిగిరి ఏరియా కోఆర్డినేటర్ అంబేద్కర్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్లు, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సభ్యులకు రుణాలు మంజూరు చేసే సమయంలో చార్జీలను వసూలు చేయడం వలన మహిళలపై ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఈ విధానాన్ని ఎస్‌హెచ్‌జీల రుణాలు విషయంలో సడలింపు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. అదేవిధంగా ఎస్‌హెచ్‌జీ రుణాల రెన్యువల్ చార్జీల భారం లేకుండా చూడాలన్నారు. ప్రతి ఏటా బ్యాంకర్లకు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల నుంచి ఆదాయం సమకూరుతుందని, ఈ విషయంలో బ్యాంకర్లు దృష్టి సారించి మేలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తద్వారా మహిళలకు ఆర్థిక భారం తగ్గి రుణాల రికవరీ, చెల్లింపులు వేగవంతంగా జరిగేందుకు వీలుంటుందన్నారు. అదేవిధంగా డీఆర్‌డీఏ సీసీలు ఇచ్చిన టార్గెట్‌ను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ రమేష్, కెనరా బ్యాంకు మేనేజర్ పృథ్వీ, ఏపీఎం అశోక్, డీఆర్‌డీఏ అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

షేడ్‌నెట్ వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి జెన్నెమ్మ

మార్టూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులవైపు మొగ్గుచూపాలని, షేడ్‌నెట్ ద్వారా సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యానవన శాఖ అధికారి పీ జెన్నెమ్మ అన్నారు. బుధవారం మార్టూరు మండల సమాఖ్య కార్యాలయంలో రైతులకు షేడ్‌నెట్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ, జిల్లా ఉద్యాన అధికారి జెన్నెమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ 50 శాతం రాయితీతో షేడ్‌నెట్‌ను ఉద్యానశాఖ ద్వారా అందిస్తామన్నారు అదేవిధంగా మిగిలిన 50 శాతం స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. షేడ్‌నెట్‌లపై ఆసక్తి ఉన్న రైతులు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీడీ చంద్రశేఖర్, డీపీఎం ఎల్‌హెచ్ రామమోహన్, ఉద్యాన అధికారి హనుమంతనాయక్, ఏపీఎం సురేంద్ర, ఏసీ లక్ష్మణాచారి, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీలో జాప్యం తగదు

పంగులూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాల రికవరీలో జాప్యం తగదని, పూర్తి స్థాయిలో వసూలు చేయాలని స్త్రీనిధి ఏజీఎం బాబూరావు అన్నారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేణంగివరం, కొండమూరు, కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో స్త్రీనిధి రుణ రికవరీ సరిగా లేదని, ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనున్నందున త్వరితగతిన రికవరీలు పూర్తిచేయాలన్నారు. లోకోస్ యాప్‌లో ఎస్ఎల్‌జీ వివరాలను నమోదు చేయాలని ఏపీఎం జ్యోతిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు సాల్మన్, సురేష్, వీవోఏలు పాల్గొన్నారు.

దేవదాయ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో దేవదాయ స్థలాలు అక్రమణలు జరుగుతున్నాయని వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. స్థానికంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం వెనుక వైపు కొంత మంది ముందుగా షెడ్లు వేసుకుని ఆక్రమిస్తున్నారని అన్నారు. కొద్దిరోజుల తరువాత వాటిని అమ్ముకుని అక్కడ నుంచి జారుకుంటున్నారని జిలానీ ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీటీ అర్జున్‌కు వినతిపత్రం అందజేశారు.

స్థలం వివాదంలో వ్యక్తిపై దాడి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో వ్యక్తిపై మరోవ్యక్తి దాడి చేశాడు. దీంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాపరాజు తోటకు చెందిన గరిక వినోద్, రాజేష్‌కు స్థలం హద్దుల విషయంలో వివాదం ఉంది. ఈక్రమంలో రాజేష్ బుధవారం ఉదయం వినోద్ తలపై ఇనుప రాడ్డుతో దాడిచేసి గాయపరిచాడు. ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. దీంతో తీవ్ర గాయాలుపాలైన బాధితుడు వినోద్ చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.



నవోదయం.. కావాలి ఉషోదయం..!

నాటుసారా రహిత రాష్ట్రమే లక్ష్యంగా ఒంగోలులో బుధవారం ప్రారంభమైన నవోదయం 2.0 కార్యక్రమం చైతన్యపూరితంగా సాగింది. మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా బాలశ్రీవీరాంజనేయస్వామితోపాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించేలా నేతల ఉపన్యాసం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో యువత ప్లకార్డులు చేబూని ఉత్సాహంగా పాల్గొన్నారు.







పోర్టుల అభివృద్ధికి పెద్దపీట

● మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



మర్రిపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టుల అభివృద్ధితో సరుకు రవాణా మెరుగవడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కేంద్రం పోర్టుల కోసం రూ.20,000 కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో మన రాష్ట్ర వాటాగా పెద్దఎత్తున నిధులు వస్తాయని తెలిపారు. రామాయపట్నం పోర్టు పనులు సంవత్సరంలోపు పూర్తవుతాయన్నారు. మూలపేట-బందర్ పోర్టు నిర్మాణ పనులు 40 శాతం పూర్తయ్యాయని సత్య వెల్లడించారు. ఐదు ఫిషింగ్ హార్బర్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. జువ్వలదిన్నె హార్బర్ పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పెదగంజాం వద్ద కొత్త పోర్టు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రగతి పనులు ఊపందుకున్నాయన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్, బెంగళూరు-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయన్నారు. మర్రిపూడి వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఎగ్జిట్ ఏర్పాటు విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీల సహకారంతో ప్రసిద్ధ పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సత్య వెల్లడించారు.

22న కంభంలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న కంభంలో జరిగే స ంకల్ప్- మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలో పదవ తరగతి నుంచి పీజీ వరకు చదివిన 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులకు నెలకు జీతం రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఇవ్వనున్నట్టు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్ లింక్‌లో రిజిస్టర్ చేసుకోవాలని జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

ముండ్లమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధ్యాయుల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో 22వ తేదీ శనివారం ఒంగోలులోని డీఈవో కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు కార్యకర్తలు ఎక్కువ మంది తరలి రావాలని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద మండల ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సమావేశం మండల శాఖ అధ్యక్షులు టీ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కానిపక్షంలో ధర్నాలు చేస్తామని అన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో

నగరాన్ని పట్టించుకున్నారా?

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ● ప్రతిపక్ష కార్పొరేటర్ ఓవర్ యాక్షన్‌పై సీరియస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్లలో కనీస అభివృద్ధి పనులు చేయకుండా గాలికి వదిలేసిన వైసీపీకి ఒంగోలు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక బడ్జెట్ సమావేశం బుధవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించగా, కో ఆప్షన్ సభ్యులుగా ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో వైసీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ టీడీపీ కూటమి పాలనపై విమర్శలు చేశారు. నగరంలో కనీస అభివృద్ధి లేదని, వేసవికి ముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయని మాట్లాడటంతో దానిపై దామచర్ల తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ఒక్క అభివృద్ధి పనీ చేయలేదనీ, కనీసం పన్నులు కూడా వసూలు చేయకపోవడంతో కోట్లు రూపాయాలలో బకాయిలు ఉన్నాయనీ అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి నిధులు కూడా తీసుకురాలేకపోయారని, కూరగాయల మార్కెట్‌ను భ్రష్టుపట్టించారని, వైసీపీ పాలనలో అవినీతికే ప్రాధాన్యత ఇచ్చి ఇప్పుడు మైకు ఉందని కదా అని మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో అభివృద్ధి ఎలా ఉందో తాము చెప్పాల్సిన అవసరం లేదని, ప్రజలే సాక్ష్యమని అన్నారు. కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలు తొలగించి ప్రక్షాళన చేయడంతోపాటు, వైసీపీ వైఫల్యంతో పేరుకుపోయిన బకాయిలు వసూళ్లు జరుగుతున్నాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నగర రూపురేఖలు మార్చుతున్నామని, అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

అభివృద్ధి కోసం ఆదాయ వనరులు పెంచుకోవాలి : ఎమ్మెల్యే బీఎన్

నగర అభివృద్ధికి ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ సూచించారు. ఎమ్మెల్యే దామచర్లతో కలిసి తాను నగర అభివృద్ధి కోసం అవసరమైన కృషి చేస్తామని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు, నేతలందరం కలిసి సమష్టి కృషితో ఒంగోలును అభివృద్ధి చేసుకుందామని కోరారు. ఇదే సమయంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మాట్లాడుతూ ప్రతిసారీ బడ్జెట్‌లో బీపీఎస్ నిధులు గురించి చెబుతున్నారని, అయితే కొన్నేళ్లుగా బీపీఎస్ నిధులు ఇంతవరకు ఎందుకు ఖర్చు చేయడం లేదని తెలిపారు. వైసీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ చేసిన వాఖ్యలపై టీడీపీ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య తీవ్రస్థాయి మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ వైఫల్యాల కారణంగానే నగరంలో అభివృద్ధి దూరమయిందన్నారు. ఆక్రమణలు, కబ్జాలతో కాలం నెట్టుకొచ్చిన వైసీపీకి టీడీపీ కూటమిని విమర్శించే అర్హత, స్థాయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం నగరంలో పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రభుత్వం అందజేసిన స్వీపింగ్ వాహనాలను ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ జెండా ఊపి ప్రారంభించారు.



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఆదాయం రూ.210.80 కోట్లు వ్యయం రూ.196.82 కోట్లు

అభివృద్ధే ధ్యేయంగా ఓఎంసీ బడ్జెట్

• కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధే ధ్యేయంగా, ఆదాయంతోపాటు వ్యయం అంచనాలు సిద్ధం చేసి, మిగులు బడ్జెట్‌పై రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఒంగోలు నగరపాలక సంస్థ 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశం బుధవారం స్థానిక కౌన్సిల్ హాలులో జరిగింది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించగా, కో ఆప్షన్ సభ్యులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ హాజరయ్యారు. టీడీపీ కూటమి, వైసీపీ కార్పొరేటర్ల సమక్షంలో బడ్జెట్ ప్రవేశపెట్టగా, ఒకరిద్దరు వైసీపీ కార్పొరేటర్లు మినహా అందరూ ఆమోదం తెలిపారు. మొత్తం రూ.210.80 కోట్ల ఆదాయంపై అంచనాలు చేయగా, రూ.196.82 కోట్లు వ్యయంతో సమావేశంలో ప్రవేశపెట్టారు. ప్రధానంగా అభివృద్ధి పనులకు సంబంధించి కాలువలు, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వగా, తాగునీటి వనరుకు నిధులు కేటాయించారు. వేతనాలు, కార్యాలయ నిర్వహణకు అత్యధికంగా ఖర్చు చేయనున్నట్లుగా పేర్కొన్నారు.

2025-26 బడ్జెట్ వివరాలు

నగరపాలక సంస్థ బడ్జెట్ ఈవిధంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రాబడి రూ.52.20 కోట్లుగా అంచనాలు వేయగా, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.10కోట్లు, అక్రమ కట్టడాట క్రమబద్ధీకరణ (బీపీఎస్) ద్వారా రూ.10కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18కోట్లు, ఎంపీ నిధులు రూ.2కోట్లు, మిగిలిపోయిన మరికొన్ని ఐడీఎస్ఎంటీ స్థలాలను వేలం వేసి, వాటి ద్వారా రూ.40 కోట్లు ఆదాయాన్ని తీసుకురానున్నారు. కార్పొరేషన్‌కు వివిధ పన్నుల ద్వారా మరికొన్ని కోట్ల రూపాయలు రావల్సి ఉండగా, సీసీ రోడ్‌లకు రూ.20 కోట్లు, కాలువలు రూ.16కోట్లు, భవన నిర్మాణాలకు, వీధిదీపాల నిర్వహణకు రూ.5కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇతర అంశాలను కలుపుకుని మొత్తం రూ.210.80 కోట్లు ఆదాయ వనరులపై అంచనాలు సిద్ధం చేశారు. అందులో కార్పొరేషన్ కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలు, ఇతరత్రా ఖర్చులు రూ.97.61 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, తాగునీటి సరఫరాకు నీటి ట్యాంకర్లకు ఇప్పటికే రూ.3.2 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ.5 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. దీంతోపాటు నగరంలో మురుగునీటి పారుదల కోసం రూ.16 కోట్లు ఖర్చు చేయనున్నారు. మొత్తంగా నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.210.80 కోట్లు ఆదాయం, రూ.196.20 కోట్లు వ్యయం, రూ.13.96 కోట్లు మిగులుతో ఆమోదించారు.

సమాజంపై అవగాహన పెంచేందుకు జ్ఞానజ్యోతి

● జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్

తాళ్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమాజం పట్ల అవగాహన పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక వీకేఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు వృత్యంతర శిక్షణ చాలా చక్కగా ఉపయోగ పడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల మానసిక మేధోవృద్ధి, భాషా వృద్ధి, సామాజిక ,భావోద్వేగ , సాంస్కృతిక, సౌందర్య, సృజనాత్మకత అభివృద్ధి చెందేలా ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య ఎంఈవో-2ఎల్. సుధాకర్‌రావు,హెచ్‌ఎం శేషగిరి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ జ్యోతి, సీఆర్‌పీలు శ్రీమన్నారాయణ, చంద్రిక, శివ రామిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతపాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయాల సందర్శన

స్థానిక వీకే ఉన్నత పాఠశాలను, కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని డీఈవో సందర్శించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. బోధనగురించి,మధ్యాహ్నభోజన వసతి గురించి అడిగి తెలుసుకున్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

పాఠశాలలో క్రీడా ప్రాంగణం ఉన్నా క్రీడలు ఆడించేవారు లేరని, ఆటస్థలంలో కనీసం కోర్టులు కూడా ఏర్పాటు చేయలేదని, పీడీ కూడా అందుబాటులో లేరని పలువురు డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పీడీని పిలిచి పిల్లలను ఎందుకు ఆటలు ఆడించలేదని అడిగారు. ఆటలు ఆడుకునేందుకు కనీసం కోర్టులను కూడా ఏర్పాటు చేయక పోవటం,పీడీ చెప్పిన విషయంపై సంతృప్తి చెందని డీఈవో తక్షణమే పీడీకి మెమో ఇవ్వాలని హెచ్‌ఎం శేషగిరిని ఆదేశించారు.



వేణుగోపాలస్వామి రథం

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

తర్లుపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి వారికి ఆలయ పూజారి కారంపూడి వెంకట రమణాచార్యులు, సాయికృష్ణ, ఆగమాచార్య తిలక్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను రథంపైకి తీసుకొచ్చి తర్లుపాడు పురవీధుల్లో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వేణుగోపాలస్వామి నామస్మరణతో తర్లుపాడు మార్మోగిపోయింది. రథోత్సవం సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం ఉభయదాతలు జవ్వాజి విజయభాస్కర్‌రావు, వాడేల వెంకట రమణలు రథోత్సవంపై స్వామివారికి పూజలు చేశారు. రథోత్సవాన్ని ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. జనసేన పార్టీ నాయకులు మజ్జిగ, బాదంపాలను పంపిణీ చేశారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి, త్రిపురాంతకం సీఐలు టి.వెంకటేశ్వర్లు, జి.అస్సాన్, తర్లుపాడు, కొనకనమిట్ల, మార్కాపురం, త్రిపురాంతకం, దొనకొండ ఎస్ఐలు బ్రహ్మనాయుడు, రాజ్ కుమార్, కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, త్యాగరాజుల ఆధ్వర్యంలో 150 మంది కానిస్టేబుల్స్, 4 డ్రోన్ కెమెరాలతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు పర్యవేక్షించారు.

వారబందీని పక్కాగా అమలు చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వారబందీ విధానాన్ని పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా సరిహద్దు 85/3 మైలు వద్ద నుంచి వస్తున్న నాగార్జున సాగర్ నీటిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వస్తున్న నీటిని పరిగణలోకి తీసుకొని జిల్లాలో నీటి అవసరం ఉన్న ప్రాంతాలకు మళ్ళించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు కూడా సాగు అవసరాల కోసమే వినియోగించుకోవాలని, నీటిని వృథా చేయకుండా అధికార యంత్రాంగానికి సహకరించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. గత డీఆర్సీ సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అధికారులతో చర్చించారు. ఆయా అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ప్రాజెక్టుల ఎస్ఈ నాగమురళీ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మరాఠి పాలెంలోని ఆయన విగ్రహానికి ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షులు కాళె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందూ ధర్మానికి శివాజీ చేసిన సేవలు అనిర్వచనీయమని అన్నారు. ధైర్యానికి, దేశభక్తికి, దైవభక్తికి ఛత్రపతి శివాజీ ప్రతిరూపమని చెప్పారు. ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దయిండే ప్రభాకరరావు, సోమాసి శివ, తిరుమలరావు, కాళే సుబ్బారావు, కాళే కృష్ణమోహన్, నాగేంద్రబాబు, సోమాసి శంకర్, కాళే వెంకట సుబ్బయ్య, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లకు మరమ్మతులు



రోడ్డు మార్జిన్‌ను శుభ్రం చేయిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణ లో భాగంగా కొండపి-టంగుటూరు రోడ్డులో స్థానిక అంబేడ్కర్ గురుకులం నుంచి దాదాపు కిలోమీటరు దూరం రోడ్డు మార్జిన్‌లకు పోలీసులు బుధవారం మరమ్మతులు చేయించారు. చిల్లచెట్లను తొలగించడంతోపాటు, గుంతలను పూడ్చించారు. ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్ డ్రైవర్‌లకు సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి

● ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డి



పోతవరంలో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డి

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చక్కని విద్యాబోధన చేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. మంచి పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యంపైన దృష్టి సారించాలని కోరారు. పోతవరం గ్రామంలోని ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్య, హెచ్ఎం వెంకటసుబ్బయ్య, రీసోర్సుపర్సన్లు మాలకొండయ్య, నాగరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల అభ్యున్నతికి టీచర్లు పాటుపడాలని ఎంపీడీవో డి. సురేష్‌బాబు తెలిపారు. సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం రెండవరోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులను ఇష్టంతో బడికి వచ్చేలా అలవాటు చేయాలన్నారు. అనంతరం ఎంఈవో వెంకారెడ్డి మాట్లాడుతూ 3 నుండి 8ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు గ్రహణశక్తి ఎక్కువగా ఉంటుందని, వారికి అక్షరాలు, అంకెలు పరిచయం చేయాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఎం.ప్రమోద, అంగన్‌వాడీ సూపర్‌వేజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

వామ్మో దొంగలు

కొప్పోలు రోడ్డులోని పలు కాలనీల్లో సంచారం

భయాందోళనలో ప్రజలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు రోడ్డులో గల పలు కాలనీల ప్రజలు రాత్రి అయితే చాలు దొంగల భయంతో హడలిపోతున్నారు. రాత్రుళ్లు దొంగలు చోరీలకు ప్రయత్నిస్తుండంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొప్పోలురోడ్డులోని జీఎస్ఆర్ కాలనీలో అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు కారులో వచ్చి ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. అయితే కాలనీవాసులు అలికిడిని గుర్తించి సీసీకెమెరాల పరిశీలించారు. దొంగలు ముసుగులు వేసుకుని తిరుగుతూ ఉండటంతో వెంటనే సమీపంలోని వారికి సెల్‌ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చుకుని అందరూ ఒక్కసారిగా బయటకు రావడంతో దొంగలు కాలికి బుద్ధి చెప్పి అక్కడిని కారులో పరారయ్యారు. గతేడాది కూడా బృందావన గార్డెన్‌లో ఓ ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఇంటి తలుపులు పగలగొట్టి చోరీకి ప్రయత్నించారు. దీంతో కొప్పోలు రోడ్డులోని కాలనీల ప్రజలు దొంగల సంచారంతో భయపడిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి కాలనీల్లో గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

● అధికారులకు మారిటైం బోర్డు చైర్మన్ సత్య సూచన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దామచర్ల సత్య

మద్రిపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కోరారు. వాటి విషయంలో అలసత్వం ప్రదర్శించడం తగదని సూచించారు. పనితీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బుధవారం మద్రిపూడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వాటిని గుర్తించి తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మద్రిపూడి గ్రామాన్ని నిషేధిత భూముల జాబితాలో చేర్పించడాన్ని ఆయన తప్పుపట్టారు. రెవెన్యూ అధికారులు తక్షణమే దేవాలయ భూములను సబ్ డివిజన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మండలంలో శాశ్వత సాగునీటి పథకాల కోసం డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఇరిగేషన్ ఏఈ విశ్వనాథంను కోరారు. రామాయపాలెం, చిలంకూరుల వద్ద చెక్ డ్యాంల నిర్మాణంతోపాటు మద్రిపూడి చెరువుకు సాగునీరు అందించే పైప్‌లైన్ కోసం అంచనాలు తయారు చేయాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన గ్రామాలలో డీప్ బోర్లను ప్రతిపాదించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కూచిపూడిలో పరదాల కింద చదువులు సాగుతున్నాయని, అర్ధంతరంగా నిలిచిపోయిన ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఆ గ్రామ వాసులు సత్యను కోరారు. గుండ్లసముద్రం ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొంతకాలంగా తెరవడం లేదని, సూపర్‌వైజర్‌కు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అధిక వర్షాల వల్ల పొగాకు పంట దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు మద్దతు ధర ఇప్పించేందుకు చొరవ తీసుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాస్ కోరారు. మద్రిపూడిలో మంచినీటి పైప్‌లైన్, సైడ్ డ్రైన్‌లను ఏర్పాటు చేయించాలని ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉప్పు సాయిబాబు కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.జ్వాలానరసింహం, ఎంపీడీవో ఎస్.జగదీష్, కొండపి సీఐ జి.సోమశేఖర్, టీడీపీ నాయకులు చేరెడ్డి నరసారెడ్డి, రేగుల వీరనారాయణ, దాసరి వెంకటేశ్వర్లు, తుళ్లూరు నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, వై.వెంకటరెడ్డి, గురజాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



లబ్ధిదారురాలికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నిరుపేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వారికి ఆర్థికభరోసా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. బుధవారం మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు, దొడ్డవరప్పాడు, నాగన్నపాలెం, గార్లపాడు, నేలటూరు, పెదకొత్తపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. మహిళలకు డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలు అందిస్తున్నామని, మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. దళితవాడల్లో సిమెంట్ రోడ్లు, తాగునీటి వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, పోతినేని శ్రీనివాసరావు, గోరంట్ల చిరంజీవి, రావిపాటి శ్రీనివాసరావు, జంపాన రమ్యకృష్ణ, మందపల్లి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మార్పులు చేయాలి

● వామపక్షాల నాయకుల డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దివాళా కోరుగా ఉందని, బడ్జెట్‌లో మార్పులు చేయకపోతే దేశంలోని అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా దిగజారిపోతాయని వామపక్షాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు సీపీఐ, సీపీఎం నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవని ఆరోపించారు. నిరుద్యోగ సమస్యను పూర్తిగా విస్మరించారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు పోరాటాలు చేస్తున్నా అవేమి బడ్జెట్‌లో పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచడంతో పాటు పనిదినాలు పెంచి రోజువారీ కూలీ కూడా పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గాన్ని బడ్జెట్‌లో విస్మరించారన్నారు. న్యూడెమెక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవని ఆరోపించారు. పోలవరంనకు కేటాయింపులు లేకపోగా స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన మేర కేటాయింపులు లేవని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ నాయకులు ఎంఎస్.సాయి మాట్లాడుతూ బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం నిధులు కేటాయింపు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వెంకట్రావు, కంకణాల ఆంజనేయులు, కె.వీరారెడ్డి, ఎం.విజయ, ప్రభాకర్, ముత్తన అంజయ్య, ఆర్.లక్ష్మి, కాలం సుబ్బారావు, బి.బాలకోటయ్య, రమేష్, కంకణాల రమాదేవి, బి.రఘురాం, పరిటాల కోటేశ్వరరావు, పద్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలి

మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే మునిసిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం కె.సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది ఎనిమిది నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. గత సమ్మె కాల ఒప్పందాల జీవోలను ఇవ్వకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. మునిసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే కార్మికుల జీవితాలు మార్చుతామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పోకల కోటేశ్వరరావు, కె.సామ్రాజ్యం, యు.కుమారి, కె.గోపి, టి. విజయమ్మ, పి.కోటేశ్వరరావు, ప్రసాద్, మురళీ, నాగేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలు సులభతరం

● డీఏవో శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు జారీ చేసే విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) ఎస్.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని చీర్వానుప్పలపాడు, పోతవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సొంత భూమి కలిగిన ప్రతి రైతుకూ 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఇకపై ఆ నెంబరు ద్వారానే వ్యవసాయ సేవలు సులభతరంతో పాటు పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పంటల బీమా, రుణాలు, రాయితీపై యంత్ర పరికరాలు, బిందు తుంపర సేద్యంపై రాయితీ పెట్టుబడిసాయం మొదలైన సేవలు పొందేందుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులు విశిష్ట సంఖ్యను పొందేందుకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పొందవచ్చని తెలిపారు. ఈ నెల 25లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అయా రైతులకు అందిస్తున్న ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వెంకట్రావు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

కొండపి: పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతూ విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని చినకండ్లగుంట, పెదకండ్లగుంట, తాటాకులపాలెం గ్రామాల్లో పర్యటించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధాన్యతను వారికి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



పెదకండ్లగుంటలో రైతులతో మాట్లాడుతున్న ఏవో విజయ్‌కుమార్

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కొండపి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 40 రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో మండలంలోని తాటాకులపాలెం వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక ఆటోలో 40 బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో ఉన్న మద్రిపూడి మండలం నరసరాజుపాలెం గ్రామానికి చెందిన వట్టికొండ బంగారయ్య, గరితోటి అశోక్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

రుణాల దరఖాస్తుల పరిశీలన పూర్తి

టంగుటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ రుణాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన బుధవారంతో ముగిసింది. మొత్తం 335 దరఖాస్తులు అందాయి. అధికారులు గురువారం నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులను విచారించనున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న ఒంగోలులోని డీఈవో కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జేవీఆర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అన్నదానానికి విరాళం

టంగుటూరు ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుకుదురు శివాలయంలో మహాశివరాత్రికి అన్నదానం ఏర్పాటు చేశారు. దీనికోసం కమ్మ సేవా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు రూ.50 వేలు విరాళాన్ని బుధవారం నిర్వాహకులకు అందించారు.

గుర్తు తెలియని మహిళకు అస్వస్థత

మద్దిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మల్లవరం గ్రామంలో గుర్తు తెలియని మహిళ అస్వస్థతకు గురైంది. సుమారు 45 సంవత్సరాలు వయసు గల మహిళ బుధవారం మల్లవరంలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అక్కడే భోజనం చేసింది. సాయంత్రం 5 గంటల సమయంలో కళ్ళు తిరిగి రోడ్డుపై పడిపోయింది. ఆమె దగ్గర రెండు పాత చీరలు సంచీలో ఉన్నాయి. అన్ని దేవాలయాలు తిరుగుతూ ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోందని ఎస్సై శివరామయ్య అన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9121102133 సెల్ నెంబరులో లేదా మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

మద్దిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బసవన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ షేక్ మజ్నా ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఈవో కిరణ్‌కుమార్, ఏఎంవో రమేష్ హాజరై హిందీ భాష ఔన్నత్యాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం పిచ్చిబాబు అధ్యక్షతన చిత్రలేఖనం, పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్ మొదలైన వాటిలో జరిగిన పోటీల విజేతలకు డీఈవో కిరణ్‌కుమార్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాసులు, శేషు, మూర్తి, శివపార్వతి, జ్యోతి, అంకయ్య పాల్గొన్నారు.

మద్దిపాడు విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

మద్దిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభను చాటారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లావ్యాప్తంగా 385 మంది పాల్గొనగా మూడు బహుమతులను మద్దిపాడు విద్యార్థులు కైవసం చేసుకోవడం విశేషం. రాజ్యాంగం-పర్యావరణ పరిరక్షణ అనే అంశంలో వ్యాసరచన పోటీ నిర్వహించగా స్థానిక కళాశాలలో జూనియర్ బైపీసీ చదువుతున్న కె.ప్రణీత ద్వితీయ బహుమతితో పాటు రూ.7,116 నగదును, ఇద్దరు సీఈసీ విద్యార్థినులు శ్రీలత, అరుణ రూ.1116 చొప్పున కన్సోలేషన్ బహుమతులను గెలుపొందారు. వారిని బుధవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ ఆదినారాయణ, ప్రవీణారాణి, సిబ్బంది అభినందించారు.

హైస్కూలు తనిఖీ

మద్దిపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపి, విషయపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టాలెంట్ టెస్టు నిర్వహణ

కంభం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం చినగానిపల్లెలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్ని సేవాసంస్థ టాలెంట్ టెస్టు నిర్వహించారు. 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టు ప్రశ్నాపత్రాలను ఆ సంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వర్లు, హెచ్ఎం శివారెడ్డి విడుదల చేశారు. విజేతలకు బహుమతులు అందచేస్తామని శ్రీకాంత్ చెప్పారు.

కాశినాయనకు పూజలు

కంభం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశినాయన విగ్రహానికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ప్రతి బుధవారం దాతల సహకారంతో కాశినాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు, అన్నదానం ఉంటుందని యోగా గురూజీ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

26న శివరాత్రి జాగరణ వేడుకలు

కంభం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయునిపేట సమీపంలో గల నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీబోదీశ్వర క్షేత్రంలో ఈనెల 26వ తేదీ శివరాత్రి తిరునాళ్ల జాగరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అల్లూరయ్య స్వామి తెలిపారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాల తోపాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

28లోగా ఇంటి పన్ను చెల్లించాలి

పొదిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పొదిలి నగరపంచాయతీ ప్రజలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటిపన్ను ఈనెల 28వ తేదీ లోగా చెల్లించాలని నగరపంచాయతీ కమిషనర్ పి శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడువు లోపు పన్ను చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలన్నారు. ఆదివారం సెలవురోజైనా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అంతేకాకుండా పట్టణంలో అనధికారికంగా ఉన్న కొళాయిలను తొలగిస్తామని, ప్రజలు గమనించి అలాంటి కొళాయిలకు రుసుం చెల్లించి రెగ్యులర్ చేయించుకోవాలని సూచించారు.

చిన్నదోర్నాల పాఠశాల అభివృద్ధికి విరాళాలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి పలువురు రూ.21,000ల విరాళాన్ని ప్రధానోపాధ్యాయులకు బుధవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మండ్ల శ్రీనివాసులు పాఠశాల అభివృద్ధి కోసం సహకరించాలని కోరిన మీదట గ్రామానికి చెందిన పలువురు దాతలు ఇప్పటికే విరాళాలు ఇవ్వగా మరి కొందరు స్పందించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ గుమ్మా పద్మజ రూ.10,000, శాతరాజుపల్లి వెంకటరావు రూ.6,000, రావెల కోటేశ్వరరావు రూ.5,000 అందజేశారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలపై రైతులకు ఏవో శ్రీనివాసులు అవగాహన కల్పించారు. మండలంలోని నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామాలలో రైతులతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో భూమి ఉన్న ప్రతి రైతు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలు, ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామాల వ్యవసాయ శాఖ సిబ్బంది నవ్య, గణేష్ పాల్గొన్నారు.

కొత్తకోట గ్రామంలో...

గిద్దలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట రైతు సేవా కేంద్రంలో శనగపంటపై పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి రైతులతో సమావేశమై క్షేత్రస్థాయిలో అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, సాంకేతిక వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక చైతన్యానికి పునాదులు
చంద్రబాబు ఘనతే

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్లాలనే దిశగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళ చైతన్యానికి పునాదులు వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చెప్పారు. పట్టణంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యాలయంలో బుధవారం జరిగిన ఎస్ఎల్ఎఫ్ రీసోర్స్‌పర్సన్ల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, వారు ఆర్థికంగా ముందుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటోందన్నారు. సున్నా వడ్డీకే రుణాలు, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. మహిళ సంక్షేమానికి ఎన్‌డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఉపాధి రుణాల విషయంలో బ్యాంకర్లతో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మెప్మా కార్యాలయంలో మరమ్మతులు, మంచినీటి సౌకర్యం కల్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వెంకటదాస్, మెప్మా సీఎంఎం ప్రసాద్, కౌన్సిలర్ పెద్దవలి, పట్టణ పార్టీ అధ్యక్షులు శానేషావలి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

బురద జల్లడం వైసీపీ నాయకులకు అలవాటే

మార్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు పంచాయతీలు, మండలాలు అభివృద్ధిబాటలో పయనిస్తుంటే చూసి తట్టుకోలేని వైసీపీ నాయకులు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని మండల టీడీపీ నాయకులు చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వక ఉత్సవ విగ్రహాల్లా మారాయన్నారు. వలంటీర్ వ్యవస్థతో సర్పంచ్‌ల అధికారులను నిర్వీర్యం చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలోనే పెద్దారవీడు మండల పరిధిలోని 19 పంచాయతీల్లో రూ.6 కోట్ల నిధులతో గ్రామాల్లో సిమెంటు, తారురోడ్లను నిర్మించామన్నారు. పాడి పరిశ్రమ కింద ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గోకులం షెడ్లకు రూ.55 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఏనుగులదిన్నెపాడు గ్రామంలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల మంజూరైందన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ బిల్లులు ఉన్నాయంటూ ప్రస్తుతం విడుదలైన నిధుల్ని స్వాహా చేసేందుకు వైసీపీ సర్పంచ్‌లు అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. చివరికి అధికారాన్ని అడ్డం పెట్టుకుని నకిలీ పట్టాల ద్వారా భూములు స్వాహా చేయడం, ప్రభుత్వ భవనాల నిర్మాణాల వద్ద మెటీరియల్‌ను కూడా దొంగతనం చేయడం వైసీపీ నాయకులకే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో జలసిరి, జల్‌జీవన్ మిషన్‌ల ద్వారా ఒక్క పనైనా పూర్తిచేశారా అని నిలదీశారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మసలుకోవాలని హితవు పలికారు.

విలేకరుల సమావేశంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ వెన్నా వెంకటరెడ్డి, తిరుమలరెడ్డి చిన్నవెంకటరెడ్డి, ఆకుమల్ల శ్రీనివాసరెడ్డి, తోకల యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

పొదిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ, ప్రైమరీ పాఠశాలల బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం ఏర్పాటు చేసిన జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా వచ్చే ఏడాది నుంచి కొత్త విధానం అమలులోకి వస్తుందన్నారు. అందుకోసం కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీడీపీవో సుధామారుతీ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కరీమూన్‌బీబి కోర్స్ డైరెక్టర్‌గా, రీసోర్స్‌పర్సన్లుగా రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్, సుభాషిణి, సాయినాథ్, సావిత్రిలు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆట పాటలతో కూడిన శిక్షణ తరగతులు



ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలోని కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పథకంలో భాగంగా శిక్షణ తరగతులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్నాయి. అందులో భాగంగా రెండో రోజైన బుధవారం కార్యకర్తలకు ఆట పాటలతో కూడిన శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ రమాదేవి, హేమ్లా నాయక్, ఆర్‌పీలు మల్లికార్జున రెడ్డి, కోటేశ్వరరావు, సూపర్‌వైజరు ఏ పద్మజ, సుజాత తదితరలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలలో పాల్గొన్న కార్యకర్తలు

హిందువుల ఆరాధ్య దైవం ఛత్రపతి శివాజీ

మార్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఆరాధ్య దైవం మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ అని హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు జల్లిపల్లి శ్రీనివాసులు చెప్పారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో బుధవారం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, నగర అధ్యక్షులు శ్రీధర సాయిసుబ్బారావు, ఆర్ఎస్ఎస్ కార్యవాహ అంజిరెడ్డి, జనార్దన్, గుంటక సుబ్బారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

మహనీయుడు ఛత్రపతి శివాజీ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మం కోసం పోరాడిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కృష్ణారావు చెప్పారు. స్థానిక శివాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శివాజీ 395వ జయంతి బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతల కృష్ణారావు, సతీష్ కుమార్, చెన్నయ్య, దేవిశెట్టి చంద్రశేఖర్, గురుమూర్తి, దేశబోయిన శీను, రామకృష్ణ, సుబ్బారావు, హరినాథ్, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

కంభంలో...

కంభం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను కంభంలోని ఆర్యమరాఠి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాలె శంకర్‌రావు, రిటైర్డ్ ఎంఈవో మాధవక్రిష్ణారావు, పీడీ మురళి, శశికుమార్, వల్లభరావు, రాజేష్, శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అని పలువురు కొనియాడారు. ఎర్రగొండపాలెంలోని కొప్పు కొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. అనిశెట్టి ఏడుకొండలు, నంద్యాల పార్థసారథి, సూరే వెంకటస్వామి, రమణారావు, రామచంద్రయ్య, విష్ణుమూర్తి, పరిటాల సుబ్బారావు, మాదాల సూర్యనారాయణ, దొంతబాదరయ్య గౌడ్, చీదెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మార్కాపురంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పశువైద్యం పోయింది.. పంక్చర్ల షాపుగా మారింది..!



పశువైద్యశాల భవనం లక్ష్యం పక్కదారిపట్టి పంక్చర్ల షాపుగా మారింది. ఆ గ్రామంలో పశువులకు జబ్బు చేస్తే సుమారు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న చిన్నదోర్నాల పశువైద్యశాలకు తరలించేందుకు పశుపోషకులు అల్లాడుతున్నారు. పెద్దదోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురంలో వాటర్ షెడ్ పథకం కింద 1998లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పశు వైద్యశాలను నిర్మించింది. కొన్నాళ్ల పాటు గోపాలమిత్ర ద్వారా పశువులకు వైద్యం అందించారు. కాలక్రమేణ పశువైద్యశాల నిరుపయోగంగా మారింది. అయినా పశుసంవర్ధక శాఖాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రమంలో ఆ భవనాన్ని కొందరు మోటారు సైకిళ్లకు పంక్చర్లు వేసేందుకు షాపుగా మార్చుకున్నారు. లక్షలు రూపాయల ప్రజాధనం దుర్వినియోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్య సిబ్బందిని నియమించాలని, పశువులకు వైద్యం అందించాలని కోరుతున్నారు.

- పెద్దదోర్నాల, ఆంధ్రజ్యోతి

శివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అవీఇవీ

దేవదాయ సహాయ కమిషనర్ పానకాలరావు



శివాలయ పరిసరాలను పరిశీలిస్తున్న సహాయ కమిషనర్ పానకాలరావు

పొదిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ సహాయకమిషనర్ పానకాలరావు కోరారు. నిర్మమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన దేవాలయాన్ని సందర్శించారు. ఈవో నారాయణరెడ్డికి అర్చకస్వాములు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామిదర్శనానికి, అభిషేకాలు చేయించుకేందుకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రథోత్సవం రోజు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, మహాశివరాత్రికి నాలుగు వేలమంది వస్తారని అంచనా ఉందని తెలిపారు. ఆ రోజు భక్తులకు మజ్జిగ, మంచినీళ్ల సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఆటోల్లో డ్రైవర్ల పక్కన సీట్లు తొలగించాలి



సీట్లు తొలగించి వేయిస్తున్న రూరల్ ఎస్సై అంకమ్మరావు

మార్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆటోలు వరుస ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో డ్రైవర్ల పక్కన ఉండే సీట్లను తొలగించాలని టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావులు చెప్పారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో బుధవారం సాయంత్రం ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆటోలను నిలిపి ముందుగా డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆటోల్లో డ్రైవర్ల పక్కనున్న సీట్లను వారితోనే తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తూ చట్టప్రకారం వాహనాలను నడుపుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలుశిక్ష తప్పదన్నారు.

పార్వతీపరమేశ్వర అలంకరణలో స్వామి



పార్వతీపరమేశ్వర అలంకరలో స్వామివారు

పొదిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి పార్వతీపరమేశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు కె. వెంకట సుధాకర్ కుటుంబ సభ్యులను దేవాలయ అధికారులు మేళతాళాలతో ఆహ్వానించారు. సహస్రనామార్చన, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. గురువారం స్వామివారికి పిగిలిగొట్టు ఉత్సవం నిర్వహించాక గంగావతరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు అభినందనలు



టీమ్ సభ్యులను అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో తృతీయస్థానం సాధించిన జూర్జి కళాశాల జట్టును బుధవారం యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు జయరావు, విక్రమ్, కోచ్ పోలయ్య, టీమ్ కెప్టెన్ సుబ్బు, సభ్యులను సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభచాటిన టీమ్ సభ్యులకు మాజీ మంత్రి సురేష్ రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.

బీసీ కార్పొరేషన్ రుణ దరఖాస్తులు పరిశీలన

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోరుతూ వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవో బండారు శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా వివిధకులాలకు చెందిన మొత్తం 417 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో ఎన్నడు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల కాలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టింది.

పెద్దదోర్నాలలో...

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ రుణాల మంజూరు దరఖాస్తులను ఎంపీడీవో నాసర్ రెడ్డి, దోర్నాల పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 228 మంది దరఖాస్తు చేసుకోగా 175 మంది అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూకు హాజరయినట్లు ఎంపీడీవో తెలిపారు.

బాధ్యులు అందరినీ సస్పెండ్ చేయాలి

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 19 : ఎర్రగొండపాలెంలో అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన ఉద్యోగుల అందరినీ కాకుండా కేవలం దళిత ఉద్యోగులను మాత్రమే సస్పెండు చేయడం ఎంతవరకు న్యాయం అని బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో నేతలు గర్నిపూడి వినయ్, ఆర్ ప్రసాదు, ఎ. సుందర్ కుమార్, ఎం. చెన్నకేశవులు, టి. వెంకటేశ్వర్లు జి. శ్రీనివాసులు, అబ్రహం, నాసరయ్య, సుభాని పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అవీ..ఇవీ


రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలి

పామూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు చెందిన వ్యవసాయ భూములకు సంబంధించి జరుగుతున్న రీ సర్వేను అధికారులు పారదర్శకంగా చేపట్టి వివాదాలకు తావు లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సూచించారు. మండంలోని చింతలపాలెం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ వ్యవసాయ భూములకు సంబంధించిన సర్వే నెంబర్లను జాగ్రత్తగా పరిశీలించి తప్పులు లేకుండా రీ సర్వే ప్రక్రియను చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్వే ఏడీ షేక్ గౌస్‌బాష, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ బీవీ రమణారావు, ఆర్ఐ బి. మల్లికార్జున, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో కె. సరస్వతి, విలేజ్ సర్వేయర్లు మహేష్, సాయి, మహేంద్ర, వేణు స్థానిక రైతులు పాల్గొన్నారు.


లంకోజనపల్లిలో బోర్ల మరమ్మతులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు

యుద్ధ ప్రాతిపదికన బోర్లకు మరమ్మతులు

దర్శి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బోర్ల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఒంగోలు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి. బాలశంకరరావు సూచించారు. మండలంలోని లంకోజనపల్లిలో క్రాస్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహిస్తున్న బోర్ల మరమ్మతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే మార్చి 16వ తేదీ వరకు క్రాస్ ప్రోగ్రాం క్రింద అన్నీ గ్రామాల్లో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా పాడైన అన్నీ బోర్లకు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో ఎల్. కృష్ణమూర్తి, ఏఈ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.


రైతు విశిష్ట గుర్తింపు కార్డుల నమోదును పరిశీలిస్తున్న దర్శి ఏడీఏ బాలాజీనాయక్

రైతులందరూ గుర్తింపు కార్డులను తీసుకోవాలి

దొనకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతుల శ్రేయస్సు నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విశిష్ట గుర్తింపు కార్డులను రైతులందరూ తప్పనిసరిగా తీసుకోవాలని దర్శి ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని గంగదేవిపల్లి, పోలేపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి తప్పనిసరిగా 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని తెలిపారు. గుర్తింపు కార్డులు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్టర్ తప్పనిసరి

పామూరు : మండలంలోని ప్రతి రైతు భూ ఆధార్ నమోదు కోసం ఫార్మర్ రిజిస్టర్ తప్పని సరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ రమణ సూచించారు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నెంబర్‌లో లింక్ అయిన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రాలకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కే రాధ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

బాధితులకు ఆర్థిక సహాయం

పామూరు,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మానవత సేవా సంస్థ పామూరు శాఖ తరుపున పట్టణంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి బుధవారం ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆసంస్థ అధ్యక్షుడు ఎం. మునలయ్య, కోశాధికారి టి. రమేష్‌లు తెలిపారు. అంకాలమ్మవీధిలోని చింతగుంట్ల చెన్నమ్మ కు సంస్థ, దాతల సహకారంతో రూ. 9500. లు, కరెంటు ఆఫీసు కాలనీకి చెందిన ఉప్పలపాటి ఖాజామోహిద్దీన్‌కు రూ. 8500 లు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వి. వెంకటేశ్వరరెడ్డి, పి. తిరుపతిరెడ్డి, బీఎస్ రంగారెడ్డి, కే నాగేశ్వరరావు, కే ప్రభాకర్, కె. శ్రీనివాసులు, టి. వెంకటేశ్వర్లు, ఎం. తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బాదాపురం ఎస్సీ కాలనీ రహదారికి మహర్దశ

ఏళ్లతరబడి మరమ్మతులు కరువు
టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో దృష్టి
తారు రోడ్డు మంజూరు
శరవేగంగా పనులు

దొనకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దీర్ఘ కాలంగా రహదారి సమస్యతో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీకి టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో మహర్దశ కల్గింది. మండలంలోని బాదాపురం ఎస్సీ కాలనీ ఏర్పడినప్పటి నుంచి సరైన రహదారి సౌకర్యం లేక కాలనీ ప్రజలు కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చందవరం వెళ్లే ప్రధాన రహదారి నుంచి అరకిలోమీటరు దూరంలో ఉన్న ఎస్సీ కాలనీకి వెళ్లేందుకు మట్టిరోడ్డు ఉండేది. ఆ రోడ్డు గుంతలమయమై ఇరువైపుల చిల్లచెట్లు పెరిగి రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. వర్షాలు కురిసిన సమయంలో రహదారి మొత్తం బురదమయమై ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించింది. టీడీపీ దర్శి నియోజకవర ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక కృషితో బాదాపురం ఎస్సీ కాలనీ రహదారికి తారురోడ్డు మంజూరైంది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.43 లక్షల వ్యయంతో మంజూరైన తారు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో బాదాపురం ఎస్సీ కాలనీ ప్రజల దీర్ఘకాలిక రహదారి కష్టాలు తొలగనున్నాయి. తమ కాలనీకి జరుగుతున్న రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రధాన రహదారి నుంచి కాలనీ వరకు వీధి లైట్లు ఏర్పాటుకు పాలకులు, అధికారులు దృష్టిసారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


చందవరం వెళ్లే రహదారి నుంచి బాదాపురం ఎస్సీ కాలనీ వరకు జరుగుతున్న తారురోడ్డు పనులు



రాకపోకలకు తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నాం

చందవరం ప్రధాన రహదారి నుంచి తమ కాలనీకి వెళ్లే దాదాపు అర కిలోమీటరు రోడ్డు అధ్వానంగా ఉండేది. రోజూ సైకిల్‌పై వెళ్లే తాను ఎదురుగా ఆటో వస్తే ఆగిపోవాల్సిన పరిస్థితి. చిల్లచెట్లు దట్టంగా పెరిగిన సమయంలో రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉండేది. వర్షాలు కురిసిన సమయంలో బురదలో రాకపోకలు చేయాల్సివచ్చేది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో తగినంత వెడల్పుతో జరుగుతున్న తారురోడ్డు పనులు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది.

- నూనె దేవదానం,
బాదాపురం ఎస్సీ కాలనీ

నీరు లేక వరిపైరు ఎండు ముఖం

నెర్రెలు బారిన మాగాణి
ఆందోళనలో వరి సాగు రైతులు
చిలకలేరు వాగుకు సాగర్ జలాలను విడుదల చేసి కాపాలని వేడుకోలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలకలేరు వాగుపై ఆధారపడి వరి పైరును సాగు చేసిన రైతులకు నీటి కష్టాలు ఏర్పడ్డాయి. రజానగరం మేజరు పరిధిలో చిలకలేరు వాగుకు నీటి ఆధారంగా వేములబండ, చింతలపూడి, కమ్మవారిపాలెం, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు ఐదు వందల నుంచి ఏడు వందల ఎకరాల వరకు వరి పైరును సాగు చేశారు. ప్రస్తుతం పైరు పొట్ట దశ ఉంది.పది రోజుల నుంచి నీరు లేక పైరు ఎండు ముఖం పట్టింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి వరి పైరు సాగు చేసి పెట్టుబడులు పెట్టి తీరా పైరు చేతికి వస్తుందనుకొనే నాటికి నీటి ఎద్దడి ఏర్పడింది. రజానగరం మేజరు నుంచి సాగర్ జలాలు విడుదల చేసి చిలకలేరు వాగుకు నింపితే తప్ప వరిరైతులు బయట పడే పరిస్థితి లేదు. ఇప్పటికే ఎకరానికి రూ. 15వేల నుంచి రూ. 25వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పొట్ట దశలో ఉన్న ఈ పరిస్థితుల్లో సాగర్ జలాలను చిలకలేరు వాగుకు నింపి వరిపైరును కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.


నీరు లేక పగుళ్లిచ్చిన వరిచేను

సాగర్ జలాలను విడుదల చేయాలి



చిలకలేరు వాగుపై ఆధార పడి వరి పైరును సాగు చేస్తున్నాం. ప్రస్తుతం పైరు పొట్ట దశలో ఉండగా నీటి ఎద్దడి ఏర్పడింది. ప్రస్తుతం నేల నెర్రెలు కొట్టింది. వెంటనే రజానగరం మేజరు నుంచి చిలకలేరు వాగుకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలి.

- కంచుమాటి ఏడుకొండలు,
రైతు, వేములబండ

ఎకరానికి రూ. 25వేలు పెట్టుబడి పెట్టాం



చిలకలేరు వాగుపై ఆధార పడి వరి పైరు సాగు చేశాను. ఇప్పటికే ఎకరానికి రూ 20 నుంచి రూ. 25వేల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా నీటి ఎద్దడి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో సాగర్ జలాలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- కె. లక్ష్మణరావు, రైతు, వేములబండ


పామూరులో శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ కూటమి సభ్యులు, ఆరె మరాఠీలు

విశ్వజన సామ్రాట్ శివాజీ

పామూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ధీరుడు, స్వతంత్ర మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ విశ్వజన హిందూ హృదయ సామ్రాట్ అని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శివాజీ 395 వ జయంతి ఉత్సవాలు ఆరే మరాఠా వెల్ఫేర్ అసోసియేషన్, శివాజీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక రామాలయం వద్ద శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, గుంటుపల్లి శ్రీనివాసులు,పందిటి హరీష్, డైండే శివశంకర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, జే. చిన సుబ్బయ్య, ఆరెమరాఠ నాయకులు డైండే రామాంజనేయులు, అంబారపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో..

కురిచేడు : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానికులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, రామారావు, జవ్వాజి సుబ్రహ్మణ్యం, పెండ్యేల ప్రసాదరావు, తల్లం సుబ్రహ్మణ్యం, సూరె నాసరయ్య గుప్తా, కురంగి నాగేశ్వర రావు, కొత్తా అయ్యప్ప సెట్టి, నాగేంద్రబాబు, ఆంజనేయులు, చెన్నకేశవులు, కృష్ణారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

కురిచేడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కురిచేడు ఎన్నెస్పీ కాలనీలోని పీడబ్ల్యూడీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని జిల్లా ఐఈఆర్ కోఆర్డినేటర్ ఈ నాగేంద్ర నాయక్ బుధవారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. భవిత కేంద్రం కోఆర్డినేటర్‌లు ట్యాబ్‌ల ద్వారా విద్య అందించాలని నాగేంద్ర నాయక్ సూచించారు. అన్ని రకాల రికార్డులు, టీచర్స్ డైరీలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఐఈఆర్ కోఆర్డినేటర్ సురేష్, గురువర్ధన్ రావులు ఉన్నారు.


భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఐఈఆర్ కోఆర్డినేటర్ నాగేంద్ర నాయక్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో దళిత బహుజన రీసోర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయంకృషితో ఎదగాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సంస్థ కో-ఆర్డినేటర్ జి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నారాయణస్వామి 67వ సప్తాహ్నిక శివరాత్రి వేడుకలు

సీఎస్‌పురం(పామూరు)ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థాన 67వ సాప్తిహ్నిక మహాశివరాత్రి మహోత్సవాలు నేటి నుంచి 26తేదీ వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్త కే చిన ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. 20వ తేదీ గురువారం పల్లకిసేవ, గ్రామోత్సవం. 21 శుక్రవారం గరుడవాహన సేవ. గ్రామోత్సవం, 22 శనివారం గజవాహన సేవ, గ్రామోత్సవం. 23 ఆదివారం శేషవాహనసేవ, గ్రామోత్సవం, 24 సోమవారం అశ్వవాహనసేవ, గ్రామోత్సవం. 25 మంగళవారం హనుమంతవాహన సేవ, గ్రామోత్సవం, 26న బుధవారం మహాశివరాత్రి పండుగ పర్వదినం సందర్భంగా రాత్రి శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివార్లకు కల్యాణ మహోత్సవం, నిర్వహించి గ్రామ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో తక్షణమే రూ. 2వేల కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ వెంకటేశ్వరరెడ్డి, ఎం. రత్నారెడ్డి లు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఈ ప్రాంత రైతాంగానికి నీరు ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరులో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పొటాషియంను చక్కగా అందిస్తే మొక్కకు ఆరోగ్యం, ధృడత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నాగరాజునాయక్, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు

అదనపు స్థలం కేటాయించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌కు ఖాళీగా ఉన్న పోరంబోకు భూమి స్థలాన్ని కేటాయించాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మావతి బుధవారం తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆప్కాస్‌లోనే మున్సిపల్ కార్మికులను కొనసాగించాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

కనిగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌లోనే మున్సిపల్ కార్మికులను కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సీహెచ్ రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించటంత పాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 16 రోజుల సమ్మెకాలానికి సంబంధించిన వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని కోరారు. కరోనా కార్మికులను కూడా ఆప్కాస్‌లోనే చేర్చాలని, బదిలీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ లక్ష్మయ్య, ఓబయ్య, చార్లెస్, గరటయ్య, రవణమ్మ, రోజమ్మ, గురవమ్మ సీఐటీయూ నాయకులు ఏడుకొండలు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


రైతు దుర్గా ప్రసాదుకు వివరాలను అందజేస్తున్న పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు రమేష్, ఏడీహెచ్ పురుషోత్తంరాజు

వేంపాడు గోడౌన్ తవుడులో కల్తీ లేదు

● పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు రమేష్

ముండ్లమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపాడులోని ఓగోడౌన్‌లో ఈనెల 9వ తేదీన తవుడులో కల్తీ జరుగుతున్నట్లు విజిలెన్స్ అధికారులు, పశు సంవర్ధకశాఖతో పాటు, తూనికలు, కొలతల శాఖ, కార్మిక శాఖ అధికారులు దాడి చేసి తొమ్మిది వందల బస్తాల తవుడును సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి నాలుగు రకాల శ్యాంపిల్స్‌ను విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. ఐతే ఈనెల 18వ తేదీ ల్యాబ్ నుంచి తవుడులో ఎలాంటి కల్తీ జరగలేదని నివేదిక వచ్చినట్టు ఒంగోలు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు రమేష్, దర్శి ఉప సంచాలకులు ఏ. పురుషోత్తంరాజులు తెలిపారు. బుధవారం వేంపాడు వచ్చి ల్యాబ్ రిపోర్టును పరిశీలించి గోడౌన్‌లో తవుడు తయారు చేస్తున్న యజమాని రావూరి దుర్గా ప్రసాదుకు గోడౌన్‌ను సీజ్ చేసిన తాళాలను అందజేశారు.

మిల్లు యజమాని, తవుడు నిర్వాహకుల మధ్య ఘర్షణ

శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లు యజమానులైన సతీస్, శ్రీధర్‌లకు, రైస్ మిల్లును గోడౌన్‌గా మార్చుకొని తవుడు వ్యాపారం నిర్వహిస్తున్న రావూరి దుర్గా ప్రసాదులు గొడవ పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో పలువురికి గాయాలు కూడా అయ్యాయి.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు కేశవరావు

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కనిగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీ పరిధిలోని చెరువులు, అలుగులు, వాగులను ఆక్రమిస్తున్న భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. తుమ్మకుంట పరిధిలోని సర్వే 96, 97, 98 సర్వే నెంబర్లలో వాగును ఆక్రమించి ప్లాట్లు వేస్తున్నారన్నారు. కొత్తూరు పరిధిలోని 538, 540 సర్వే నెంబర్లలోని వాగు వద్ద బేస్‌మెంట్ వేశారన్నారు. శంఖవరం పరిధిలోని 419 సర్వే నెంబరులో వాగును ఆక్రమించి మట్టి తోలారన్నారు. సూరాపాపిరెడ్డి నగర్‌లో 894, 895 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ అవసరాల కోసం వదిలిన ఎనిమిది ప్లాట్లను ఆక్రమించి విక్రయించారన్నారు. అధికారులు కేవలం పరిశీలనకే పరిమితయ్యారని ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఒక్కటై ఉమ్మడి రియల్ వ్యాపారం చేస్తూ అక్రమాలకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం సమాచారం

చప్టాగోడను ఢీకొని బైకిస్ట్ మృతి

పామూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ టి. కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన నేదరపల్లి ఏసుపాదం (40) బైక్‌పై వెళ్తుండగా జాతీయరహదారిపై అదుపుతప్పి రావిగుంటపల్లి గ్రామం వద చప్టాగోడను ఢీకొన్నాడు ఈ ప్రమాదంలో ఏసుపాదం అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొన్న ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కిశోర్‌బాబు

విద్యుదాఘాతంతో రైతు మృతి

దర్శి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపాలెం వద్ద విద్యుత్‌షాక్‌తో బుధవారం ఒక రైతు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం రైతు ఎం. వెంకటరెడ్డి(30) పొలంలో వరినాట్లు వేయిస్తున్నాడు. మాగాణిలో ఎరువులు చల్లేందుకు ఎరువుల బస్తాలను విప్పదీసే కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొడవలితో పనిచేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పొరపాటున కొడవలి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, 13 నెలల కుమారుడు ఉన్నాడు. ఇంటి యజమాని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



● వేమూరులో ఆలపాటికి మద్దతుగా మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

- సమీపిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికలు
- గుంటూరు జిల్లాలో అత్యధికంగా గ్రాడ్యుయేట్లు
- జోరు పెంచిన కూటమి
- శ్రేణులతో మంత్రులు.. ఎమ్మెల్యేల భేటీలు
- పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా వామ పక్షాలు.. ఉద్యోగ సంఘాలు
- బరిలో 25 మంది అభ్యర్థులు

గుంటూరే.. కీలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ఓటముల్లో గుంటూరు జిల్లా పట్టభద్రుల ఓటర్లు కీలకంగా మారారు. ఈ జిల్లాలోనే అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. అన్ని జిల్లాల కంటే అధికంగా 1,08,109 ఓట్లు గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. చాలా తక్కువగా ఏలూరు జిల్లాలో 16,099 ఓట్లు మాత్రమే ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 63,114 ఓట్లు, ఎన్‌టీఆర్ జిల్లాలో 78,063 ఓట్లు, పల్నాడు జిల్లాలో 57,238 ఓట్లు, బాపట్ల జిల్లాలో 24,493 ఓట్లు ఉన్నాయి. గుంటూరు పట్టణంలోనే అత్యధికంగా ఓట్లు ఉండటంతో ఇక్కడ పట్టు సాధించేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

● కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 27న జరగనుంది. సమయం దగ్గర పడుతుండటడంతో అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గెలుపు కోసం గ్రాడ్యుయేట్‌లతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఓటర్లతో సమావేశాలు నిర్వహించడంతో పాటు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మండల.. పట్టణ స్థాయిలో ఎమ్మెల్యేలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా వామపక్ష పార్టీలు.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు ఇచ్చి లక్ష్మణరావుకు ఓటు వేయాలని కోరుతున్నారు.

● కూటమి అధికారంలో ఉండటంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలకు ఎన్నిక బాధ్యతలను అప్పగించి టీడీపీ అధిష్ఠానం ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియపై సమీక్షిస్తోంది. ఎమ్మెల్సీ బూత్ స్థాయిలో 30 మంది ఓటర్లకు ఒక కార్యకర్త పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు బూత్ స్థాయి కార్యకర్తలు, నేతలతో సమన్వయం చేసుకుంటూ ప్రచార సరళిని గమనిస్తున్నారు. మంత్రులు.. ఎంపీలు కూడా ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలపాటి మద్దతుగా వారు ప్రచారం నిర్వహిస్తున్నారు. భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా కూటమి నేతలు క్షేత్ర స్థాయిలో ఓటర్లను కలుస్తున్నారు. ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికగా ఎమ్మెల్సీ ఎన్నికను స్వీకరించారు. ఆలపాటి భారీ మెజారిటీనే లక్ష్యంగా ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. గెలుపు లాంఛనమే భారీ మెజార్టీనే లక్ష్యమని ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

● లక్ష్మణరావుకు బలం ఉద్యోగులు.. ఉపాధ్యాయుల యూనియన్లు. ఇరువురికి పట్టభద్రులతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా ప్రచార హోరు పెంచారు. వామపక్షాలు.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు లక్ష్మణరావు వైపు నిలిచాయి. ఈ ఎన్నికలలో వైసీపీ పోటీలో లేకపోవడంతో ఆ పార్టీ పరోక్షంగా లక్ష్మణరావుకు మద్దతు తెలిపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.



వినుకొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జీవీ, మక్కెన



సత్తెనపల్లి: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్‌సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు



167 ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న సహకార సంఘాలు

520 పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య

30 ప్రస్తుతం జీతాలు రాని సహకార సంఘాలు

వడ్డీ వాత జీతం కోత

- జీతాలకోసం ఆరునెలలుగా సొసైటీ ఉద్యోగుల ఎదురు చూపులు
- ఉమ్మడి జిల్లాలోని 30 సహకార సంఘాల్లో ఇదే పరిస్థితి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విధివిధానాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. వసూలు చేసిన వడ్డీలో 30 శాతం మాత్రమే జీతాలకు వినియోగించుకోవాలన్న నిబంధన ఉద్యోగులకు ప్రతిబంధంకంగా మారింది. దానివల్ల ఉమ్మడి జిల్లాలోని చాలామంది ఉద్యోగులు గడచిన ఐదారు నెలలుగా జీతాలు అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని 30 సహకార సంఘాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది. అయినా జిల్లా అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

30 సంఘాల పరిస్థితి మరీ ఘోరం..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 సహకార సంఘాలు ఈ ఏడాది రుణాల వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. దానివల్ల ఆయా సంఘాల్లో పనిచేస్తున్న సుమారు 110 మంది ఉద్యోగుల కు గత ఆరునెలలు గా జీతాలు రావటం లేదని తెలుస్తోంది. ఒక వేళ నిబంధన మీరి జీతాలు తీసుకున్నా దాని బాధ్యత కార్యదర్శి పై పెడుతుండటం తో ఎవరూ సాహసాలు చేయడం లేదు.

చేయూత నిస్తే...

వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు అన్నీ ఒకప్పుడు మంచి వెలుగు వెలిగినవే. లాభాల బాటలో ఉన్న వాటిని కోరి కష్టాల పాలు చేశారు. ప్రభుత్వం తలచుకుంటే మళ్ళీ పూర్వ స్థితికి తీసుకురావచ్చునని సహకార సంఘాల నేతలు చెబుతున్నారు. రైతులతో ముడిపడిన ఎరువుల అమ్మకాలు వంటివి సొసైటీలకు అప్పగిస్తే ఉద్యోగుల జీతాల కు ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఒక యూరియా బస్తా అమ్మితే రూ. 6.25 లాభం కింద చెల్లిస్తున్నారని అంటున్నారు. యూరియా బస్తా విలువ రూ. 266 అయితే బయట వ్యాపారులు రూ. 350 వరకు విక్రయిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కి వస్తున్న స్టాక్‌లో ఎక్కువ భాగం ప్రయివేటు వ్యాపారులకే వెళ్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఎరువులను సహకార సంఘాల వద్ద నుంచి తీసివేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయాలు జరిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్ళీ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు జరుపుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగించి పూర్తిగా ఎరువులను సహకార సంఘాల కు కేటాయిస్తే ఉద్యోగులు నెల నెలా జీతాలకు ఇబ్బందులు పడకుండా ఉంటారని సహకార ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

30 శాతం నిబంధన ఏమిటంటే..

సహకార సంఘాల ద్వారా మంజూరు చేసే రుణాలకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక సహకార సంఘం నుంచి రూ. కోటి వరకు రైతులకు రుణాలు మంజూరు చేస్తే దానిపై వడ్డీ వస్తుంది. ఆ వడ్డీలో 30 శాతం జీతాలకు , 20 శాతం నిర్వహణకు వినియోగించాలి. వాస్తవానికి రైతులు తీసుకున్న కోటి రూపాయల అప్పును ఒకే సారి చెల్లించే పరిస్థితి ఉండదు.అందులో సగ భాగం మాత్రమే జమ వేస్తారు. అయినా సహకార సంఘం రూ. కోటి కి జిల్లా బ్యాంకుకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితి వల్ల సహకార సంఘా లు ఆర్థిక లేమి వల్ల కునారిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. వడ్డీలో కేవలం 30 శాతం మాత్రమే జీతాలకు వినియోగించాలన్న నిబంధన వల్ల చాలా మంది ఉద్యోగుల కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.





అవయవాలను తరలిస్తున్న సిబ్బంది

మరణిస్తూ.. మరొకరికి జీవితం

- విజయవాడ మహిళ అవయవదానం
- ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- కుటుంబ సభ్యుల అనుమతితో అవయవదానం
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



ఎం.సరస్వతి (ఫైల్)

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయ పడిన మహిళ మరణిస్తూ మరి కొందరికి జీవితానిచ్చారు. విజయవాడ భవానీపురానికి చెందిన ముత్యాల సరస్వతి (54) ఈ నెల 14వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం మం గళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులపాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించిన వైద్యులు, మంగళవారం సరస్వతి బ్రెయిన్ స్టెమ్ డెడ్‌కు గురైనట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియపర్చి, అవయవదానం పై అవగాహన కల్పించారు. సరస్వతి కుటుంబ సభ్యులు, బంధువులు అవయవదానం చేసేందుకు అంగీకరించడంతో బుధవారం సాయంత్రం ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు సరస్వతి కు టుంబ సభ్యులు ముందుకు రావడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. దాత శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు నేత్రాలను సేకరించి మణిపాల్, ఎయిమ్స్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రులకు పంపుతున్నట్టు తెలిపారు. అవయవదాతల త్యాగాన్ని గౌరవిస్తూ దాతల అంత్యక్రి యలను ప్రభుత్వ లాంఛనాలతో చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతెమ్ శాంతా సింగ్, గుంటూరు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎయిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధి చెల్లింపులేవి?

- రెండు నెలలుగా అందని కూలి
- నేటికీ కొలతలు కూడా వేయని వైనం
- ఆందోళనలో కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రెండు మాసాల కిందట ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు నేటికీ కూలీలకు డబ్బులు చెల్లించలేదు. కనీసం చేసిన పనులకు కొలతలను కూడా వేయలేదని, అధికారుల నిర్లక్ష్యంతో కూలి అందలేదని 2వేల మంది కూలీలు వాపోతున్నారు. బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామంలో గత ఏడాది డిసెంబరులో అమృత్ సరోవర్ నీటి కుంట అభివృద్ధి పనులకు గాను రోజుకు 250 మంది చొప్పున కూలీలు పనులకు వచ్చారు. మెదట్లో ఉపాధి అధికారులు కూలీలకు రోజువారీ కూలి పడుతుందని, అందరూ పనులకు రావాలని కోరారు. ఇతర పనులకు వెళ్లినవారిని సైతం ఇక్కడకు రప్పించి పనులు చేయించారు. కూలీలు కూడా గ్రామంలోనే పనులు అందుబాటులో ఉన్నాయని కుంట పనులకు వెళ్లారు. ఉదయం వెళ్లి మధ్యాహ్నం 1 గంట వరకు పనులు చేసిన కూలీలు ఉన్నారు. కానీ అధికారులు కూలీలు రెండు వారాలు పనులు చేసినా వాటికి కొలతలు తీయక పోగా చెల్లింపులకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి పేమెంట్ స్లిప్‌లు కూడా ఇవ్వలేదు. రెండునెలలైనా చేసిన పనులకు కూలి డబ్బులు రాకపోవడంతో అధికారుల మాటలు నమ్మి మోసపోయామని సుమారు 2వేల మంది కూలీలు లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కూలి చెల్లించాలని కోరుతున్నారు.



ముక్తేశ్వరంలో ఉపాధి పనులు చేసిన కూలీలు (ఫైల్)



పనులను తనిఖీ చేసిన అధికారులు (ఫైల్)

పనులను తనిఖీ చేసిన అధికారులు

ముక్తేశ్వరంలో అమృత్ సరోవర్ నీటి కుంట పనులను పథకం క్లస్టర్ ఏపీడీ కోటయ్య నాయక్ సిబ్బందితో కలిసి అప్పట్లో తనిఖీ చేశారు. కూలీలు కుంట పనులు వెంటనే పూర్తి చేయాలని వారికి పలు సూచనలు కూడా చేశారు. ప్రతి రోజు గ్రామంలో ఉండే క్షేత్ర సహాయకుడు వచ్చి పనులు చేయించారని కానీ అధికారులు మాత్రం తమకు రెండు వారాలకు సంబంధించిన కూలి చెల్లింపులు చేయలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయాలి

సింగంశెట్టి ప్రమిలా, ముక్తేశ్వరం



తాను డిసెంబరులో గ్రామంలోని నీటి కుంటలో రెండు వారాలు పనులు చేశాను. నేటికీ కూలి చెల్లించలేదు. ఎవరిని అడిగినా తమకు సరైన సమాధానం చెప్పడం లేదు. అసలు కొలతలే తీయలేదు. తమకు వెంటనే అధికారులు న్యాయం చేయాలి.

పనులు చేసినా కూలి చెల్లించలేదు

నాదెండ్ల వెంకటస్వామి, ముక్తేశ్వరం



గ్రామంలో ఉన్న అమృత్ సరోవర్ కుంట పనులు చేసి రెండు మాసాలు అయింది. నేటికీ కూలి చెల్లించలేదు. సుమారు రెండు వేల మంది వరకు రెండు వారాలపాటు పనులు చేశాం. అధికారులు తనిఖీ కూడా చేశారు. కానీ కూలి డబ్బులు ఇవ్వలేదు.

విచారించి చెల్లిస్తాం

- ఏపీడీ కోటయ్యనాయక్

అమృత్ సరోవర్ నీటి కుంట పనులు చేసిన సమయంలో తాను తనిఖీ చేశాను. కూలీలకు కూలి చెల్లింపులు చేయని విషయం తన దృష్టికి రాలేదు. వెంటనే విచారణ చేసి కూలీలకు రావాల్సిన కూలి వచ్చేలా చర్యలు చేపడతాం.

రిసెప్షన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారులు తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు, మెటీరియల్‌ని రిసెప్షన్ కేంద్రాలు వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు స్ట్రాంగ్ రూంలో సక్రమంగా భద్రపరచాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ భద్రపరిచే స్ట్రాంగ్ రూం వద్ద రిసెప్షన్ కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరచటానికి ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర పోలింగ్ మెటీరియల్ రిసెప్షన్ కేంద్రానికి తీసుకువస్తారన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ మెటీరియల్, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లు, ఇతర సామగ్రి తీసుకోవటానికి, తీసుకున్న వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరచటానికి పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇతర జిల్లాల రిసెప్షన్ కేంద్రాల నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్ తీసుకోవటానికి, జిల్లాకు ఒక టీంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, పీవో డిక్లరేషన్, డైరీ, పేపర్ సీల్ అకౌంట్ ఫారాల్లోకి ప్రతి కాలమ్‌ను పరిశీలించి తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి తీసుకున్న మెటీరియల్ ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూం టీంలతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ బూత్‌లు వారీగా స్ట్రాంగ్ రూంకు తరలించాలన్నారు. అనంతరం రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామగ్రి తీసుకునే అధికారులు పరిశీలించాల్సిన ఫారాలు, వాటి వివరాలను మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. జేసీ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డీటీసీ కె సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

టిడ్కోల్లో.. జీవనోపాధి కేంద్రాలు

- తొలిగా మంగళగిరి, చిలకలూరిపేటలో...
- రూ. 17.8 కోట్లను సమకూర్చనున్న సీఆర్‌డీఏ, ఉడా

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశం నడిచి వెళ్లే దూరంలోనే ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం కింద టిడ్కో భవన సముదాయాల వద్ద జీవనోపాధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో తొలి దశలో మంగళగిరిలోని వీ.పురం-1, చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం-1, 2టిడ్కో భవన సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వాటిల్లో అన్ని రకాల దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా టిడ్కో ఫ్లాట్లలో నివాసం ఉంటున్న వారికి స్థానికంగానే ఉపాధి కల్పించడం వీటి లక్ష్యంగా మునిసిపల్ పరిపాలన శాఖ చెబుతున్నది. జీ+3 భవనాలను నిర్మించి వాటిల్లో దుకాణాలను ఏర్పరుస్తారు. ఈ ప్రాజెక్టుని స్థానిక పట్టణాభివృద్ధి సంస్థలతో కలిసి ఏపీ టిడ్కో అమలు చేస్తుంది. వృత్తి నైపుణ్యం, మార్కెటింగ్ మద్దతు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌ని మెప్మా పర్యవేక్షిస్తుంది.



ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంగళగిరిలోని వీ.పురం-1, చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం-1, 2లో ఇప్పటికే లబ్ధిదారులు నివసిస్తున్నారు. వీ.పురం-1లో 1,728 కుటుంబాలు, పురుషోత్తం పట్నంలో 5,520 కుటుంబాలు నివాసం ఉంటు న్నాయి. దీని దృష్ట్యా వీ.పురం-1లో 35 షాపులను నిర్మించాలని నిర్ణయించారు. 2025 ఫిబ్రవరి - జూన్ మధ్యన 20 దుకాణాలను రూ. 2.4 కోట్లు, జూలై - నవంబరు మధ్యన మరో 15 దుకాణాలను రూ. 1.8 కోట్లతో నిర్మిస్తారు. దీనికి సీఆర్‌డీఏ నిధులు సమ కూర్చాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. పురుషోత్తం పట్నం-1, 2లో తొలి విడతలో 30 దుకాణాలను రూ. 3.6 కోట్లు, రెండో విడతలో 80 దుకాణాలను రూ. 9.6 కోట్లతో స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తుంది.

టిడ్కో జీవనోపాధి కేంద్రాలను కేటాయించేందుకు ఔత్సాహిక లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దరఖాస్తులను పరిశీలన చేసి సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. ఆయా షాపులు కాస్టు-టూ-కాస్టు ప్రాతిపదికన స్వయం సహాయక బృందంలో 2 నుంచి ఐదుగురు సభ్యులకు కేటాయిస్తారు. ప్రతీ చదరపు అడుగుకు రూ. 2 వేల వరకు ధర నిర్ణయిస్తారు. షాపుల ఆపరేషన్, నిర్వహణ ఎస్‌హెచ్‌జీలే చూసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకుల నుంచి ఆర్థికసాయం కూడా ఇప్పిస్తారు. ఉత్పాదక కేంద్రాలు, గార్మెంట్ యూనిట్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వంటివి ఏర్పాటుకు అనుమతిస్తారు.



విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో మాట్లాడుతున్న విశ్రాంత జిల్లా సెషన్స్ న్యాయాధికారి, సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

- అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- నిరాధార ఆరోపణలు చేస్తే ఫిర్యాదుదారులపై చర్యలు
- విశ్రాంత జిల్లా సెషన్స్ న్యాయాధికారి, సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సర్ విక్టర్ ఇమ్మానియేల్

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అదాలత్‌ల ద్వారా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని రిటైర్డ్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి, సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. అద్దంకిలోని శింగరకొండ రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఆవరణలో బుధవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. అధికారుల ప్రవర్తనపై, అవినీతి పై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వినియోగదారులతో మర్యాదగా మెలగాలన్నారు. వినియోగదారులు కూడా అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేయరాదన్నారు. నిరాధార ఆరోపణలు అని తేలితే ఫిర్యాదుదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల సమయంలో తనిఖీ అధికారులు ఇష్టానుసారం కేసులు రాయకుండా నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు. అద్దంకిలో 3వ సారి విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. రెండు సంవత్సరాలలోపు సమస్యలను అర్జీల రూపేణ ఇస్తే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. విజయవాడలోని సీజీఆర్‌ఎఫ్ కార్యాలయంలో కూడా నేరుగా అర్జీలు అందజేయవచ్చన్నారు. అద్దంకిలో జరిగిన విద్యుత్ అదాలత్‌లో మొత్తం 8అర్జీలు రాగా, అందులో 4 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన 4 అర్జీలకు సంబంధించి 15 రోజులలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు వెంకటకృష్ణ, శ్రీనివాసులు, సునీత, ఎస్‌ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురికి అపరాధ రుసుం

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకొని కోర్టు లో హాజరుపరచగా సెకండ్ క్లాస్ మేజి స్ట్రేట్ అపరాధ రుసుం విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఐషర్ లారీ డ్రైవర్ బాబూనాయక్ మద్యం సేవించి నడుపుతున్నట్లు గుర్తించి బుధవారం ఉదయం డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మరో ముగ్గురు మోటార్‌సైకిల్స్ నడుపుతున్న వ్యక్తులకు కూడా డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించగా మద్యం సేవించినట్లు గుర్తించారు. 4 గురుని కోర్టులో హాజరుపరచగా లారీ డ్రైవర్ బాబూనాయక్‌కు 10 వేల రూపాయలు, మిగిలిన ముగ్గురు మోటార్‌సైకిల్స్ నడుపుతున్న వ్యక్తులకు రూ.2వేల చొప్పున సెకండ్ క్లాస్ న్యాయాధికారి శింగయ్య అపరాధ రుసుం విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

కట్టెల ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

మరొకరికి గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌ను కట్టెల ట్రాక్టర్ ఢీకొనడంతో ఎనికపాటి చౌదరి(19) అక్కడికక్కడే మృతి చెం దగా, మరో యువకుడు అనిల్‌కు తీ వ్రగాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి మండలం తిమ్మాయపాలెంకు చెందిన చౌదరి, అనిల్ మోటార్ సైకిల్‌పై బుధవారం రాత్రి కుంకుపాడు వైపు నుంచి తిమ్మాయపాలెం వస్తుండగా కొటికలపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న కట్టెల ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చౌదరి అక్కడిక్కడే మృతి చెందగా, అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో అద్దంకి వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు.

వంద శాతం పనిదినాలు సాధించాలి



సమవేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు అందరు మార్చి నాటికి వంద శాతం ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. బుధవారం తన కార్యాలయంలో మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి చివరి నాటికి 62000 పనిదినాలు కల్పించాలన్నారు. 6200 మంది కూలీలకు ఈ-శ్రమ కార్డులు రిజిస్ట్రేషన్ ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 ఫారం పాండ్లు గుర్తించి గుర్తించి మార్చి చివరినాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగునకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సింగయ్య సూచించారు. బుధవారం మండలంలోని గోపాలపురం ఎస్టీ కాలనీలో పర్యటించిన ఆయన గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం చేయాలని, చెత్త మొత్తం అక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలలో కేఆర్‌కే విద్యార్థుల ప్రతిభ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీల ద్వారా పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. ఈ నెల 8వ తేదీన ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో జరిగిన వ్యాసరచన పోటీలలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఎస్.చిన్న లింగయ్య(బీఏ), ఎస్.శారమ్మ వరుసగా రూ.5116 రూ.1116 నగదు బహుమతులను గెలుపొందారు. ఈ సందర్భంగా బుధవారం విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కుటుంబాల్లో స్ట్రోక్ కలకలం

- గుండెపోటు మరణాలతో తల్లడిల్లుతున్న ప్రజలు
- ఇటీవల తరచూ ఘటనలు
- నియంత్రణకు ప్రభుత్వం కృషి
- బాధితుల కోసం అందుబాటులో ఇంజక్షన్
- 6 గంటల్లోపు తీసుకుంటే ప్రయోజనమంటున్న వైద్యులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో చీరాల, చుట్టు పక్కల ప్రాంతాల్లో గుండెపోటు మరణాలు అధికంగా నమోదవుతున్నాయి. గతంలో గుండెపోటు సుమారు 50 సంవత్సరాలు పైబడిన వారికి వచ్చేది. కొద్ది సంవత్సరాలుగా వయసుతో సంబంధం లేకుండా సంభవిస్తున్నాయి. మానసిక ఒత్తిడి, ఆర్థిక సమస్య ఇలా కారణాలేమైనప్పటికీ గుండెపోటు బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అనేక మంది అకస్మాత్తుగా చనిపోతుండడంతో అప్పటి వరకూ ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాల్లో స్ట్రోక్ కలకం సృష్టిస్తోంది. కుటుంబ పెద్ద, చేతికి అందివచ్చే కొడుకులు మృత్యు కౌగిట్లో చేరుతుండడంతో విచారకరం. దీంతో ఆ కుటుంబాలు దయనీయంగా మారుతున్నాయి. గతనెల 15వ తేదీన కుటుంబంలో ఒకేరోజు ఎవరి పని వారు చేసుకుంటున్న అన్నదమ్ములు ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. చీరాల మునిసిపల్ పరిధిలోని గొల్లపాలెంకు చెందిన గొల్లప్రోలు గంగాధర్(42) మృత్యువాత పడగా, అన్నను హాస్పిటల్‌కు తరలించి వైద్య పరీక్షలు చేయించిన తమ్ము డు గోపీ పవన్‌కుమార్(36) అ న్న మరణ వార్త విని అక్కడికక్కడే కుప్పకూలాడు. దీంతో కు టుంబంలో గతంలోనే భర్తను, అనంతరం ఇద్దరు కుమారుళ్లను కోల్పోయిన తల్లి ఒంటరై రోదిస్తుంది. కావూరివారిపాలెం ఆంధ్రకేసరినగర్‌లో భార్య అనారోగ్యంతో చనిపోగా మూడోరోజు భర్త డీ.సతీష్ (42) గుండెపోటుతో మృతి చెందారు. దీంతో వారి ఇద్దరి ఆడ పిల్లలు తీరని వషాదంలో మునిగి పోయారు. అలాగే వైకుంఠపురం శ్రీరామనగర్‌కు చెందిన కావూరి శివాజీ (45) పదిరోజులు కిందట గుండెపోటుతో మృతి చెందారు. పెద్ద దిక్కును కోల్పోయి భార్య, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఇలా అనేక కుటుంబాలను స్ట్రోక్ రోడ్డున పడేస్తుంది. ఈనేపథ్యంలో గుండెపోటు బాధితులను కాపాడేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఖరీదైన టెనెక్టెప్లస్ ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఉచితంగా వేసేందుకు చర్యలు చేపట్టడం సంతోషకరం.



హాస్పిటల్లో స్టెమీపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

లక్షణాలు

- ఎడమవైపు గుండె నొప్పి అధికంగా ఉండడం
- కాళ్లు, చేతులు చల్లగా మారడం
- కడుపులో మంట
- కళ్లు బైర్లు కమ్మడం

గుండెపోటుపై ప్రత్యేక అవగాహన



గుండెపోటు మరణాలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సమస్య ఉన్న వారిని గుర్తించి వెంటనే టెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఇస్తే ప్రమాదం నుంచి విముక్తి ఉంటుంది. దీని ఖరీదు ప్రైవేటుగా రూ.40వేల వరకు ఉండగా, ప్రభుత్వం ప్రభు త్వ వైద్యశాల్లో ఉచితంగా సరఫరా చేస్తోంది. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్టెమీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గుండెపోటు సమస్యగా అనుమానం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించడం వలన ప్రమాదం నుంచి రక్షించుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో 30 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ప్రతి ఆరు నెలలకు చెకప్ చేయించుకోవడం మంచిది. అలాగే ఆహారంలో జాగ్రత్తలు, వ్యాయామాలు వంటివి చేయడం ఆరోగ్యకరం.

– డా.సుభాషిణి, సూపరింటెండెంట్, చీరాల ఏరియా హాస్పిటల్



గుండెపోటు ఇంజక్షన్‌లు నిల్వ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆ గంట చాలా విలువైనది



చీరాలలో ఒకేరోజు గుండెపోటుతో మృతి చెందిన అన్నదమ్ములు

గుండెపోటు బారిన పడిన వారికి మొదటి గంట చాలా విలువైనది. సమస్య గ్రహించిన వెంటనే ముందుగా సీపీఆర్ చేయించడంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అలాగే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో దాదాపుగా మద్యం సేవించడం, పొగతాగడం, పని భారాన్ని తగ్గించుకోవడం, ఒత్తిడికి గురి కాకుండా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆహార నియమాలు కచ్చితంగా పాటించాల్సి ఉంది. అయితే కొవిడ్ అనంతరం ఆరోగ్య సిబ్బంది ఉపయోగించిన ఒక రకమైన వ్యాక్సిన్‌పై ప్రజల్లో పలు అనుమానాలు ఉండగా, వాటిపై వైద్యాధికారులు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పెరుగుతున్న రోగుల సంఖ్య



గుండె వ్యాధి సమస్యలతో రోజుకు రెండు లేక మూడు కేసులు వస్తున్నాయి. ఇలా చూసుకుంటే మా ఒక్క హాస్పిటల్‌కే సుమారు నెలలో 50 మందికి వైద్యం అందిస్తున్నాం. ఇటీవల కాలంలో హృదయ రోగుల సంఖ్య పెరుగుతుంది. సమస్యకు దూరంగా ఉండాలంటే వ్యాయామం, సక్రమమైన ఆహారం అవసరం.

– డా.ఐ.బాబూరావు, గుండెవైద్య నిపుణుడు, ప్రేమ నర్సిం

అద్దంకిలో మినీ బైపాస్‌కు రెడీ



అద్దంకిలో మినీ బైపాస్‌గా మార్చనున్న అద్దంకి మేజర్ కాలువ..
మినీ బైపాస్ నిర్మాణం కోసం తొలగించాల్సిన కాలువ కట్టపై ఉన్న తాత్కాలిక ఇళ్లు

రూ.15కోట్లతో ప్రతిపాదనలు

సిద్ధం చేస్తున్న మున్సిపల్ అధికారులు

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య కు తాత్కాలికంగా ఉపశమనం కోసం మినీ బైపాస్‌కు మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.30కోట్లతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం జరగబోతుందంటూ హడావుడి చేసిన వైసీపీ నేతలు రూపాయి నిధులు కూడా మంజూరు చేయించలేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు కూడా ఇబ్బంది పడ్డారు. ఎన్నికల సమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చిన మేరకు మినీ బైపాస్ నిర్మాణం కోసం దృష్టి సారించారు. మంత్రి రవికుమార్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అద్దంకి మేజర్ కాలువ పై రేణింగవరం రోడ్డు నుండి నామ్ రోడ్డు వరకు సుమారు 1.600 కి.మీ దూరం రెండు వైపులా సీసీ రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్‌లు, విద్యుత్ లైట్లు ఏర్పాటుకు సుమారు రూ.15కోట్లు ఖర్చు అవుతుందని అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మధ్యలో యథావిధిగా సాగర్ జలాలు ప్రవహించేందుకు కాలువ ఉంచనున్నారు. ఆయా కాలనీల నుంచి వచ్చే మురుగు నీటి కోసం రెండు వైపులా సైడ్ డ్రైన్ లు ఏర్పాటు చేయనున్నారు. అయితే అద్దంకి మేజర్ కాలువ, కట్టలను ఆక్రమించి సుమారు 50 మంది తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు కేటాయింపు జరిగినా బొమ్మనంపాడు రోడ్డు లో ఉన్న లేఅవుట్ దూరం అని ఇళ్ల నిర్మాణాలకు నిరాకరించారు. దీంతో ప్రత్యామ్నాయంగా స్థల సేకరణ చేసి ఖాళీ చేయించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మినీ బైపాస్ నిర్మాణం పూర్తయితే అభ్యుదయనగర్, నంబూరివారిపాలెం, టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, వాసవీ నగర్, శివసాయి నగర్, సాయినగర్ తదితర ప్రాంతాల ప్రజలు సులువు గా నామ్ రోడ్డుకు, రేణింగవరం రోడ్డులకు చేరుకునే అవకాశం ఏర్పడుతుంది.

24న పీఎం కిసాన్ నిధులు విడుదల

జిల్లాలో 2.48 లక్షల మంది రైతులకు రూ.49.51 కోట్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు బాసటగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిని ఈనెల 24వతేదీన రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏడాదికి మూడు విడతలుగా ఒక్కొక్క విడత రూ2వేలను జమ చేస్తోంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 19 విడతలుగా నగదును జమ చేస్తున్న కేంద్రం 2024-25 ఆర్థిక సంవత్సరం మూడో విడత నగదు జమను ఈనెల 24న చేయనున్నారు. జిల్లాలో 2.48లక్షల మంది రైతులు పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. అందుకు సంబంధించి ఒక్కొక్క రైతుకు రూ.2వేల చొప్పున జిల్లాకు రూ.49.51 కోట్లు జమకానున్నాయి.

వెలుగు పీడీగా నారాయణ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వెలుగు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాష్ట్ర సచివాలయంలో ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తుండగా మూడు రోజుల క్రితం జిల్లా వెలుగు పీడీగా నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఇక్కడ పీడీగా పనిచేసిన వసుంధర శ్రీకాళహస్తికి బదిలీ అ య్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జీల పాలన సాగింది. నారాయణ కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అయ్యో 'పాప'ం

- మానసిక సమస్యతో తల్లి అఘాయిత్యం
- బిడ్డతో సహా చెరువులో దూకి ఆత్మహత్య



సుజాత, యశ్వజ్ఞ మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ తల్లి తన తొమ్మిది నెలల పాపను తీసుకుని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వి.అజయ్ బాబు తెలిపిన సమాచారం మేరకు.. సంతనూతలపాడులోని బాపట్ల బజారుకు చెందిన బాపట్ల వెంకటేష్‌కు, కొనగానివారిపాలెం చెందిన పట్టీ లక్ష్మయ్య కూతురు సుజాతను మూడేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి 9 నెలల పాప యశ్వజ్ఞ ఉంది. ఇటీవలి వరకు బాగానే ఉన్నా రెండు నెలల నుంచి మాత్రం సుజాత మానసిక సమస్యతో ఇబ్బంధిపడుతుంఇ. తరచూ తాను చనిపోతానంటూ చెబుతుండేది. దీనికి సంబంధించి చికిత్స పొందుతోంది. కాగా 10 రోజుల క్రితం సుజాత తన బిడ్డను తీసుకుని మంగమూరు వైపు వెళ్లగా, భర్త, తల్లిదండ్రులు వెతికి పట్టుకుని ఇంటికి తెచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో మరోమారు మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి పాపను తీసుకుని వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న భర్త వెంకటేష్, బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో ఆమె ఆచూకీ కోసం రాత్రంతా విచారించారు. అయితే బుధవారం తెల్లవారుజామున చెరువులో పాప మృతదేహం తేలియాడుతూ ఉండటం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ అజయ్‌బాబు గజ ఈతగాళ్లతో వెతికించగా ఉదయం 8 గంటలకు సుజాత మృతదేహం లభ్యమైంది. దీంతో సుజాత తన పాపతో సహా మంగళవారం సాయంత్రమే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతురాలు తండ్రి పట్టీ లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.అజయ్‌బాబు తెలిపారు.



గొనసపూడి గ్రామంలో లబ్ధిదారుని ఇంటి వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు

ప్రతి రోజు నీటిని క్లోరినేషన్ చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజు తాగునీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎం.అనంతరాజు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలోని తాగు నీటి చెరువు, ఫిల్టర్ బెడ్లను బుధవారం ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువులోని నీరు ఏమైనా కలుషితమయ్యాయని ఆయన పరిశీలించారు. చెరువు చుట్టపక్కల ఎరువుదిబ్బలు, జంతు కళేబరాలు లేకుండా చూడాలని అన్నారు. చెరవు పరిసరాలు, ఫిల్టర్ బెడ్ల చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. గ్రామంలోని లబ్దిదారుని ఇంటికి వెళ్లి నీటి పీహెచ్ లెవల్‌ను పరిశీలించారు. జీబీఎస్ వ్యాధి కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో తాగునీటి చెరువులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు తాగునీటి శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పర్చూరు డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దుద్దుకూరు(ఇంకొల్లు) : మండలంలోని దుద్దుకూరు గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని జిల్లా ఆర్‌డబ్ల్యూస్ ఎస్‌ఈ అనంతరాజు బుధవారం పరిశీలించారు. ఫిల్టర్ బావులు, వాటర్‌హెడ్ ట్యాంకులోని నీరు, రక్షిత వాడుకలో ఉన్న మంచినీటి చెరువులను పరిశీలించారు. క్లోరినేషన్ సక్రమంగా జరుగుతుందో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పర్చూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.సతీష్, పంచాయతీ కార్యదర్శి శశి, మన్నెం చింపిరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తే చర్యలు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై వెంకట్రావు హెచ్చరించారు. బుధవారం కారంచేడు ప్రధాన రోడ్డులో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.

రైతుకు విశిష్ట గుర్తింపు

- ఆధార్ తరహాలో 11 అంకెలతో కార్డు జారీ
- రైతు సంక్షేమ పథకాలకు ఆదే కీలకం
- జిల్లాలో 4.79 లక్షల మంది
- అందులో పీఎం కిసాన్ లబ్ధిదారులు 2.49 లక్షల మంది
- ఆర్‌ఎస్‌కేలలో నమోదు, ఇప్పటికే లక్షకుపైగా వివరాలు

ఒంగోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అన్ని అవసరాలకు ప్రధాన గుర్తింపు కార్డుగా ప్రస్తుతం చెలామణిలో ఉన్న ఆధార్‌కార్డు తరహాలో ఇక నుంచి ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి కానుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల లబ్ధి ఇక నుంచి ఈ గుర్తింపు కార్డు ప్రామాణికం కానుంది. పట్టా భూమి ఉండి, పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతిరైతు గుర్తింపు కార్డును తీసుకోవడం తప్పనిసరి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అనుసంధానం, ఆధునికీకరణ చర్యలలో భాగంగా కేంద్రప్రభుత్వం ఈ విధానం ప్రవేశపెడుతుండగా ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో దాదాపు నెలరోజులుగా ఇందుకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి దీనిపై అవగాహన కల్పించి ఈనెల 10 నుంచి గుర్తింపు కార్డుల కోసం వివరాలను నమోదు చేస్తున్నారు. ఈనెల 25తేదీని ఇందుకు తుది గడువుగా నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 6.05లక్షల హెక్టార్ల సాగు భూమి ఉండగా 4.79లక్షల మందికిపైగా రైతులు ఉన్నట్లు అంచనా. అందులో 2.49 లక్షల మంది కేంద్రప్రభుత్వం అందజేసే పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు ఉన్నారు.

వేగంగా నమోదు ప్రక్రియ

త్వరలో ఈ విడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో పడనుండగా వారు తక్షణం ఈ గుర్తింపుకార్డులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 38 మండలాల్లో ఉన్న 616 రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే)లో గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే లక్ష మంది రైతులకుపైగా ఆయా ఆర్‌ఎస్‌కేలలో గుర్తింపు కార్డులకోసం తమ వివరాలను నమోదు చేసుకున్నారు. కాగా సొంత పొలం ఉన్న ప్రతి రైతు తమ ప్రాంతానికి చెందిన రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకలును అందజేయాలి. ఆధార్‌తో అనుసంధానమైన ఉన్న మొబైల్ ఫోన్ కూడా తీసుకెళ్లి వివరాల నమోదు అనంతరం ఓటీపీ తెలియజేసి విశిష్ట గుర్తింపు కార్డును పొందాల్సి ఉంటుంది.

సేంద్రియ సాగు.. ఆదాయం బాగు

- ఆ ఎరువులకు పెరుగుతున్న డిమాండ్
- ఆరోగ్యమే మహాభాగ్యమంటున్న అధికారులు, రైతులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పంటలకు రసాయనిక ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి ఖర్చు పెరిగింది. మరోవైపు భూసారం కూడా తగ్గింది. ఈక్రమంలో పంటలకు చీడ, పీడలు సోకి ఉత్పత్తులు తగ్గిపోతూ వచ్చాయి. ఇదే విషయాన్ని ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తున్నారు. మారుతున్న కాలానుగుణంగా అన్నదాతల్లో కూడా మార్పు వస్తోంది. గుడ్డిగా పంటలు సాగుచేయకుండా తెలివిగా పంటలకు పెట్టుబడి తగ్గించే దిశగా ఆలోచన చేస్తున్నారు. అన్నదాతలను ఆర్థికంగా గట్టెక్కించాలని వ్యవయసాయ శాఖ అధికారులు కూడా విధిగా తగు సూచనలు. సలహాలు ఇస్తూ సేంద్రియ సాగు, ఎరువుల వాడకంపై రైతులు మళ్లేలా అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల సూచనలు తూచ తప్పకుండా రైతులు సేంద్రియ సాగుతో లాభాలను ఆర్జిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు ప్రస్తుతం డిమాండ్ పెరిగిందనే చెప్పాలి.

భూసారం పెంపొందించేలా చర్యలు

రసాయనిక ఎరువుల వాడకం ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో దాదాపుగా చైతన్యం వచ్చింది. దీంతో భూసారాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువుల పేడ, కుంటలు, చెరువుల్లో పూడిక మట్టిని పొలాల్లోకి తరలించే పనిలోపడ్డారు. పశు సంపద లేని రైతులు సేంద్రియ ఎరువుల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు.


సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న రైతులు

రబీలో వర్షాధారంపై 2,500 ఎకరాల్లో సాగు

రబీ సీజన్‌లో చీరాల మండలంలో సుమారు రూ.2వేల ఎకరాలు, వేటపాలెం మండలంలో సుమారు 500 ఎకరాలు వర్షాధారంపై వరి, మినుము, మొక్కజొన్న తదితర పంటలను సాగు అవుతున్నాయి. దీంతో రైతులు భూసారాన్ని పెంచుకునేందుకు పొలాల్లో పొడి ఎరువును ట్రాక్టర్‌ల ద్వారా తోలుకునే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాలు బాగా కురిసినప్పుడు నేలను దుక్కి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

సాగుకు పెట్టుబడి తగ్గుతుంది



సేంద్రియ ఎరువులు వాడితే ఖర్చులు తగ్గుతున్నాయి. నేలను దుక్కి చేసేముందు సేంద్రియ ఎరువులను పొలంలో వేసుకుని దుక్కి చేయడం వలన భూసారం పెరుగుతోంది. ఈక్రమంలో పెద్దగా యూరియా వంటి ఎరువులను వాడాల్సిన అవసరం ఉండదు.

- గవిని నాగరాజు, రైతు

సేంద్రియ ఎరువులతో ఆదాయం, ఆరోగ్యం



సేంద్రియ ఎరువులతో సాగు చేయడం వలన రైతులకు ఆదాయం, ప్రజలకు ఆరోగ్యం ఉంటుంది. పశువుల పేడ, పూడికమట్టి పొలంలో వేస్తే భూమిలో తేమశాతం పెరుగుతుంది. పురుగులు నశిస్తాయి. పంటలకు తెగుళ్లు ఉండవు. దిగుబడి ఆశాజనకంగా కూడా ఉంటుంది.

- సుమతి, వ్యవసాయాధికారి, చీరాల



రేణంగివరంలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలు సులభతరం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ధనరాజ్ మాట్లాడుతూ మండలంలో పీఎం కిసాన్ లబ్ధిదారులు 9642 మంది ఉండగా, ఇప్పటి వరకు 4640 మంది లబ్ధిదారులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించినట్లు చెప్పారు. పీఎం కిసాన్ కింద లబ్ధి పొందిని రైతులకు కూడా 1400 మందికి గుర్తింపు సంఖ్యలు కేటాయించామన్నారు. ప్రతి రైతు గుర్తింపు సంఖ్య కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సేవలు సులభతరం చేసేందుకు భూ యజమానులకు గుర్తింపు సంఖ్య జారీ చేసే ప్రక్రియ చేపట్టిందని ఏవో సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, రేణంగివరం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి సాగులో ఉన్న మొక్కజొన్నను రైతులో కలిసి పరిశీలించారు. ఈ నెల28లోగా గుర్తింపు కార్డు పొందాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది అలగ్జాండర్, శివాని, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : సాగు భూమి ఉన్న రైతులంతా గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఐడీ నెంబర్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కుమారి కోరారు. బుదవారం మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొగాను పరిశీలించారు.

మల్చింగ్ పద్ధతిలో సాగుతో మేలు

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు మల్చింగ్ పద్ధతిలో పంటలు సాగు చేయడం ఎంతో మేలు అని జిల్లా ఉద్యాన అధికారి పి.జెన్నెమ్మ పేర్కొన్నారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో మల్చింగ్ పద్ధతిలో సాగులో ఉన్న పుచ్చను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మల్చింగ్ పంటలను తెగుళ్ల బారి నుంచి కాపడుకోవడమే కాకుండా కలుపు, నీటి అవిరి కాకుండా మొక్కకు అందుబాటులో ఉంటుందన్నారు. సబ్సిడీపై మల్చింగ్ పట్టలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి హనుమంత్‌నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

పలువురు ప్రముఖుల నివాళి

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నక్కల ఆంజనేయులు (99) వయోప్రాయంతో మంగళవారం రాత్రి కన్నుమూశారు. బుధవారం టీడీపీ బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడు గరటయ్య, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, మాజీ ఎంపీ చిమటా సాంబు, కూరపాటి స్టాలిన్ తదితర నాయకులు, కార్యకర్తలు ఆంజనేయులు పార్థీవదేహానికి నివాళులర్పించారు. బుధవారం స్వగ్రామం వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆంజనేయులుకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు గతంలో మరణించారు. రెండవ కుమారుడు నక్కల రమణారావు పంచాయతీ రాజ్ ఈఈగా పనిచేసి, రిటైర్డ్ అనంతరం ప్రస్తుతం బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ వద్ద ఓఎస్డీగా పని చేస్తున్నారు. అలాగే చిన్న కుమారుడు అర్జునరావు రిటైర్డ్ రైల్వే అధికారి. అలాగే కబడ్డీ అంతర్జాతీయ క్రీడాకారునిగా రాణించి రిటైర్డ్ అయ్యారు. కుమార్తె వకులాదేవి ప్రస్తుతం ఒంగోలు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పార్టీ ప్రారంభించినప్పటి నుంచి ఆంజనేయులు పందిళ్లపల్లి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి క్రియాశీకలంగా పనిచేశారు. దీంతో ఆయన మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


ఆంజనేయులు (ఫైల్)

మానవత్వం చాటుకున్న మణికేశ్వరం గ్రామస్థులు

ముస్లిం సంప్రదాయంతో గుర్తు తెలియని వృద్ధుడికి అంత్యక్రియలు

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందడంతో మణికేశ్వరానికి చెందిన ముస్లింలు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మణికేశ్వరం పునరావాసకాలనీ వద్ద రెండు నెలలుగా సుమారు 70 సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్న వృద్ధుడు కదలలేని స్థితిలో ఉన్నారు. గ్రామస్థులు ఇచ్చే ఆహారం తింటూ ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మృతి చెందీ ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి గుర్తించి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లాతో పాటు పలువురు గ్రామస్థులు ముందుకు వచ్చారు. ఏఎస్సై నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి పర్యవేక్షణలో షేక్ కరిముల్లా, బడావలి, సఫీర్ కరిముల్లా, అజ్మతుల్లా, ఫర్జుల్లా చాంద్‌బాషా, నాగయ్య తదితరులు ఆధ్వర్యంలో ముస్లిం సంప్రదాయంలో ఆ వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు.


అంత్యక్రియలకు తీసుకెళ్తున్న ముస్లింలు

తిరునాళ్లను విజయవంతం చేయాలి

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చినగంజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి మహాశివరాత్రి తిరునాళ్ల విజయవంతానికి కృషి చేయాలని చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో ఈ నెల 26వ తేదీన జరుగనున్న మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని రెవెన్యూ, పోలీసు, గ్రామ కార్యదర్శులు, పలుశాఖల అధికారులు బాలకోటేశ్వర, రామకోటేశ్వర స్వామి దేవస్థానాల కమిటీ సభ్యులతో బుధవారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీవో మాట్లాడుతూ కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి, సోపిరాలలోని రామకోటేశ్వరస్వామి ఆలయాల వద్ద తాగనీరు, పారిశుధ్యం సమస్య తలెత్తకుండా దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏఈ పి.గణనారాయణను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు సమస్య లేకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల ప్రాంగణాల్లో రాకపోకలకు ఇబ్బంది లేకుండా షాపులు క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయాల వద్ద విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ఇచ్చిన సమయానికే నిలిపి వేయాలని చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ సూచించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, రాకపోకల సమస్యలు లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా బాలకోటేశ్వరస్వామి, రామకోటేశ్వరస్వామి ఆలయాలను చీరాల ఆర్డీవో, చీరాల డీఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీవో, డీఎస్పీ, ఇంకొల్లు సీఐ, రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.బసవరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్యను రామకోటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయనులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయంలో అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు పీ.సాయిశ్రీచరణ్, బి.నాగేంద్ర, రామకోటేశ్వరస్వామి, బాలకోటేశ్వరస్వామి దేవస్థానాల కమిటీల సభ్యులు, చినగంజాం, కొత్తపాలెం గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

26న కొండాయపాలెంలో మహా రుద్రాభిషేకం

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని 26వ తేదీన మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో ఉన్న గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయం వద్ద మట్టి శివలింగానికి రుద్రాభిషేకం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలు భవితకు సోపానాలు

చినగంజాం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు బాలల భవితకు సోపానాలని ఎంఈవో-1 అజయ్‌బాబు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జ్ఞాన జ్యోతి మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, సౌందర్య - సాంస్కృతిక అభివృద్ధిపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడంపై హెచ్‌ఎం, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ల కే.వాణిశ్రీ, ఎస్.సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మెరుగైన బోధనను అందిస్తామనే నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించినపుడే కేంద్రాలలో చిన్నారుల సంఖ్య పెరుగుతుందని ఎఫ్ఎల్ఎన్ జిల్లా కోఆర్డినేటర్ సుభాని అన్నారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కేంద్రాన్ని బుధవారం సుభాని సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, రిసోర్‌పర్సన్‌లు వంశీకృష్ణ, శీనివాసరావు, వెంకట్రామయ్య, దీపాదేవి పాల్గొన్నారు.

మార్టూరు : చిన్నపిల్లలకు ఆటపాటలతో కూడిన చదువును నేర్పాలని అంగన్‌వాడీ టీచర్లను ఎంఈవో వస్రాంనాయక్ కోరారు. బుధవారం మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రామాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను సందర్శించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు బి రాంబాబు, యెహోషువ, సీఆర్పీలు శ్రీనివాస్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

పర్చూరు : పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జ్ఞాన జ్యోతి శిక్షణ లక్ష్యమని శిక్షకుడు బాలకోటేశ్వరావు అన్నారు. మండలం, చెరుకూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల శిక్షణ తరగతులు రెండో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణను కార్యకర్తలు వినియోగించుకోవాలని బాలకోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.


కడవకుదురు పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

కూలీల ఆటోను ఢీకొన్న స్కూల్ బస్సు

ఐదుగురు మహిళలు, ఆటోడ్రైవర్‌కు గాయాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఢీకొని ఐదుగురు మహిళలు, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఇంకొల్లుకు చెందిన సుమారు 8 మంది మహిళ వ్యవసాయ కూలీలు బుధవారం ఉదయం కేశవరప్పాడులో వ్యవసాయ కూలి పనులకు ఆటోలో వెళుతున్నారు. ఈక్రమంలో మార్గ మధ్యలో జరుబులవారిపాలెం బ్రిడ్జి సమీపంలో ఆటోకు ఎదురుగా స్కూల్ బస్ వస్తుంది. ఆప్రాంతంలో మార్జిన్ తక్కువగా ఉండడంతో అప్పటికే గ్రహించిన ఆటో డ్రైవర్ కోటేశ్వరరావు ఆటోను కొంచెం రోడ్డు పక్కకు నిలిపాడు. అయినా వేగం నియంత్రణ చేసుకోకుండా స్కూల్ బస్ వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న స్వప్న, శిరీష, బుల్లెమ్మాయి, భారతి, రుక్సానాతో సహా ఆటో డ్రైవర్ గాయపడ్డారు. దీంతో స్థానికులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో కొందరు స్వల్పంగా మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న కారంచేడు ఎస్సై వెంకటరావు హాస్పిటల్‌కు చేరుకుని క్షతగాత్రుల నుంచి సంఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై వెంకటరావు


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జెన్నెమ్మ, పక్కన డీఆర్‌డీఏ పీడీ పద్మ

షేడ్‌నెట్ వ్యవసాయం లాభదాయకం

మార్టూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులవైపు మొగ్గుచూపాలని, షేడ్‌నెట్ ద్వారా సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన అధికారి పీ జెన్నెమ్మ అన్నారు. బుధవారం మార్టూరు మండల సమాఖ్య కార్యాలయంలో రైతులకు షేడ్‌నెట్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ, జిల్లా ఉద్యాన అధికారి జెన్నెమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ 50 శాతం రాయితీతో షేడ్‌నెట్‌ను ఉద్యానశాఖ ద్వారా అందిస్తామన్నారు అదేవిధంగా మిగిలిన 50 శాతం స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. షేడ్‌నెట్‌లపై ఆసక్తి ఉన్న రైతులు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీడీ చంద్రశేఖర్, డీపీఎం ఎల్‌హెచ్ రామమోహన్, ఉద్యాన అధికారి హనుమంతనాయక్, ఏపీఎం సురేంద్ర, ఏసీ లక్ష్మణాచారి, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీలో జాప్యం తగదు

పంగులూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాల రికవరీలో జాప్యం తగదని, పూర్తి స్థాయిలో వసూలు చేయాలని స్త్రీనిధి ఏజీఎం బాబూరావు అన్నారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేణంగివరం, కొండమూరు, కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో స్త్రీనిధి రుణ రికవరీ సరిగా లేదని, ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనున్నందున త్వరితగతిన రికవరీలు పూర్తిచేయాలన్నారు. లోకోస్ యాప్‌లో ఎస్ఎల్‌జీ వివరాలను నమోదు చేయాలని ఏపీఎం జ్యోతిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు సాల్మన్, సురేష్, వీవోఏలు పాల్గొన్నారు.

దేవదాయ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో దేవదాయ స్థలాలు అక్రమణలు జరుగుతున్నాయని వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. స్థానికంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం వెనుక వైపు కొంత మంది ముందుగా షెడ్లు వేసుకుని ఆక్రమిస్తున్నారని అన్నారు. కొద్దిరోజుల తరువాత వాటిని అమ్ముకుని అక్కడ నుంచి జారుకుంటున్నారని జిలానీ ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీటీ అర్జున్‌కు వినతిపత్రం అందజేశారు.

ముప్పవరంలో రోడ్డెక్కిన మురుగు


ముప్పవరం ప్రధాన రహదారిలో సీసీ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పంగులూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామ ప్రధాన రహదారిలో సీసీ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. పంగులూరు వైపు నుంచి ముప్పవరంలోకి ప్రవేశించే సీసీ రోడ్డులో కొంతదూరం మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. ఈ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు రోడ్డుపై పేరుకున్న పాచితో కుడిన మురుగుపై వాహనం స్కిడ్డయి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజులతరబడి ప్రవహిస్తున్న మురుగు రోడ్డుపై నిలవడంతో పాచి పేరుకుని పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మురుగు రోడ్డెక్కకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి


చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో వ్యక్తిపై మరోవ్యక్తి దాడి చేశాడు. దీంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాపరాజు తోటకు చెందిన గరిక వినోద్, రాజేష్‌కు స్థలం హద్దుల విషయంలో వివాదం ఉంది. ఈక్రమంలో రాజేష్ బుధవారం ఉదయం వినోద్ తలపై ఇనుప రాడ్డుతో దాడిచేసి గాయపరిచాడు. ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. దీంతో తీవ్ర గాయాలుపాలైన బాధితుడు వినోద్ చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

మురుగు ప్రవాహానికి తొలగిన అడ్డంకి


పూడికను తొలగించిన తరువాత కాలువ

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పలు కాలనీ వాసులను పట్టి పీడిస్తున్న మురుగు నీటి సమస్య పరిష్కారం కోసం తాత్కాలిక చర్యలకు మున్సిపల్ అధికారులు ఉపక్రమించారు. అద్దంకి పట్టణంలోని అభ్యుదయ నగర్ నుండి రామ్‌నగర్ వరకు ఉన్న అద్దంకి మేజర్ కాలువ కాస్తా ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు నిలిచి మురుగు కూపంగా మారింది. మురుగు ప్రవాహానికి అడ్డంకులు ఉండడంతో ఎక్కడికక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి తాత్కాలికంగా మురుగు నీరు ప్రవహించే విధంగా పూడిక తీత పనులు చేస్తున్నారు. అయితే పలు చోట్ల కాలువను ఆక్రమించి నిర్మాణాలు ఉండటంతో మురుగు నీరు ప్రవాహం కొంత దూరం మాత్రమే సాగే అవకాశం ఉంది. ఎట్టకేలకు తాత్కాలికంగానైనా పూడిక తీత పనులు చేపట్టడంతో కొద్ది రోజుల పాటు దుర్వాసన నుంచి విముక్తి లభించే అవకాశం కలిగింది.


అద్దంకి మేజర్ కాలువలో పూడిక తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్





నెల్లూరు : వెంకటేశ్వరపురంలో పునాదుల దశలోనే ఆగిన జగనన్న ఇళ్లు

గూడు.. గోడు!

వైసీపీ అధినేత జగన్ రెడ్డి నవరత్నాలలో పేదలందరికీ పక్కా ఇళ్లు ముఖ్యమైనది. ఈ హామీతో పేదలంతా సంబరపడిపోయారు. కానీ జరిగిందేమిటి!?. వైసీపీ పెద్దల మాటలు నమ్మి ఇళ్లు కట్టిచ్చే బాధ్యతను కాంట్రాక్టర్ల చేతికి అప్పగించిన వేలాది మంది లబ్ధిదారులు నిలువునా మునిగిపోయారు. అటు ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులు, ఇటు లబ్ధిదారులు ఇచ్చిన డబ్బులు మొత్తం దిగమింగేసి కాంట్రాక్టర్లు చల్లగా జారుకున్నారు. మంజూరైన ఇల్లు మొండిగోడలకే పరిమితం కాగా ఇంటిమీద ప్రభుత్వం మంజూరు చేసిన 1.80 లక్షలు మాత్రం అప్పుగా మిగిలిపోయింది. దీనికితోడు డ్వాక్రా సంఘంలో రుణం పొందో లేదా బయట అప్పు చేసి కాంట్రాక్టరుకు చెల్లించిన రూ.40వేలు నష్టపోయారు. వీటన్నిటికి కన్నా బాధాకరం ఏమంటే ఇంటి నిర్మాణం పూర్తి కాని లబ్ధిదారులకు ఇక నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వరు. అంతేకాదు భవిష్యత్తులో వీరికి ఇల్లు వచ్చే అవకాశమూ లేదు. జిల్లాలో ఇలాంటి అభాగ్యుల సంఖ్య వేలల్లోనే ఉంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- జగనన్న ఇళ్లు.. కాంట్రాక్టర్ల భోజ్యం
- ఇళ్లు కట్టకనే రూ.246.98 కోట్లు దండేశారు!
- లబోదిబోమంటున్న 25వేల మంది లబ్ధిదారులు
- ఇప్పటి ఇళ్లు పూర్తికావు.. భవిష్యత్తులో మరో ఇల్లు రాదు!
- పేదల సొమ్ము దిగమింగి దర్జాగా తీరుగుతున్న అక్రమార్కులు
- రక్షణ కోసం 'కూటమి' పంచన చేరిన వైనం

వివిధ కారణాలతో జగనన్న పక్కా ఇళ్లను నిర్మించుకోవడానికి పేదలు ముందుకు రాలేదు. ఈ పరిస్థితి అధిగమించకుంటే ఎన్నికల నాటికి ప్రమాదమన్న ఉద్దేశంతో చివరి సంవత్సరంలో లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణానికి బలవంతం పెట్టారు. ఆ క్రమంలో వేగంగా ఇళ్లు నిర్మించడానికి కాంట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. ఇలా జిల్లావ్యాప్తంగా 180 ఏజెన్సీలను రంగంలోకి దించి, 29,238 ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఇంటి బిల్లులు కాంట్రాక్టర్లకే అందేలా ఏర్పాటు చేశారు. ఇంకేముంది కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారు కానీ నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదు. 29,238 ఇళ్లలో కేవలం 6,017 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన వాటిని అసంపూర్తిగా వదిలేశారు. ఇలా అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాల్లో 80 శాతం వరకు పునాదుల దశ దాటలేదు. అంటే కాంట్రాక్టర్లు పునాదులు వేసి బిల్లులు మొత్తం భోంచేశారు. వీరికి కొంతమంది హౌసింగ్ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందజేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పునాదుల దశ దాటని ఇళ్లకు మాత్రం మాత్రం రూ.246.98 కోట్లు డ్రా చేసుకున్నారు.

దండుకున్నారు.. వెళ్లిపోయారు!



జగనన్న ఇల్లు నిర్మాణం చేయాలంటే ముందుగా డబ్బు కట్టాల్సిందేనన్నారు. దీంతో అప్పుచేసి రూ.20వేలు కట్టాను. రోజులు గడుస్తున్నాయి కానీ పనులు మాత్రం పూర్తి చేయలేదు డబ్బు తీసుకున్న కాంట్రాక్టర్ ఎక్కడున్నారో తెలియదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇంటిని పూర్తిచేసి అప్పగించాలి.

- ఖాదర్ ఉన్నీసా, జనార్దన్‌రెడ్డికాలనీ (నెల్లూరు)



ఈయన పేరు బెల్లంకొండ పవన్ కుమార్. వైసీపీ ప్రభుత్వంలో నివాస స్థలం మంజూరవగా ఇంటి నిర్మాణానికి ఉపక్రమించారు. ప్రభుత్వం ఇచ్చిన రూ1.8 లక్షలు సరిపోక తన వద్ద ఉన్న కొద్దోగొప్పో నగదుతో కొంతమేర పనులు చేశాడు. బిల్లులు పూర్తయినా నిర్మాణం పూర్తి కాలేదు. కూలి పనులే జీవనాధారమైన ఈయనకు ఆర్థిక స్థోమత సరిపోక ఏంచేయాలో తోచని పరిస్థితిలో ఉండిపోయాడు.

ఇంతవరకు ఇల్లు అప్పగించలేదు



జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఇప్పటికి రెండేళ్లు కావస్తోంది. ఇంటికి అదనంగా రేకులు, పూతపనులు చేస్తామని చెప్పి కాంట్రాక్టర్ మా వద్ద రూ.10 వేలు తీసుకొన్నారు. ఇప్పుడు పూర్తి చేయకుండా నిలిపివేశారు. అద్దె ఇంటిలోనే ఉంటున్నాము. ఇప్పటికైనా ఇంటి నిర్మాణం పూర్తిచేసి మాకు అప్పగించాలి.

- గంగమ్మ, వెంకటేశ్వరపురం (నెల్లూరు)

భవిష్యత్తులో కష్టమే!

పోనీ ఇంత నష్టపోయినా భవిష్యత్తులో వీరికి ఇళ్లు వచ్చే అవకాశం ఉందా అంటే ప్రస్తుత నిబంధనల ప్రకారం అదీనూ లేదు. ఇంటి పట్టాలు అన్నీ ఆన్‌లైన్‌లో రికార్డు అయ్యాయి. రికార్డుపరంగా లబ్ధిదారుడికి మరోసారి ఇంటి పట్టా ఇవ్వడానికి సాధ్యపడదు. అలాగే పక్కా ఇళ్ల మంజూరు కూడా ఆన్‌లైన్‌లో రికార్డు అవుతుంది. ఒకసారి పక్కా ఇళ్లు మంజూరై ఒక బిల్లు విడుదల అయినా కొత్తగా మరో ఇల్లు ఇచ్చే అవకాశం లేదు. ఇలా సుమారు 25వేల మంది పేదలు అన్ని విధాలా నష్టపోయారు.

అదనంగా మరో రూ.40వేలు

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోదని, మరో రూ.40వేలు అదనంగా లబ్ధిదారుడు చెల్లిస్తే కాంట్రాక్టర్లకు గిట్టుబాటు అవుతుందని అప్పటి వైసీపీ నాయకులు లెక్కలు గట్టారు. ఆ మేరకు ప్రతి లబ్ధిదారుడి నుంచి అదనంగా 40వేలు కాంట్రాక్టరుకు ఇప్పించారు. ఈ నగదు కోసం డ్వాక్రా సంఘ సభ్యులైన లబ్ధిదారులకు ఆ సంఘం నుంచి ప్రత్యేకంగా అప్పు మంజూరు చేయించారు. రుణాలకు అర్హతలేని మహిళలు ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి లేదా, అధిక వడ్డీకి అప్పులు చేసి మరీ కాంట్రాక్టర్లకు పోశారు. ఇప్పుడు ఇళ్లు కట్టకపోగా అప్పులపాలయ్యారు.

కూటమి ప్రభుత్వం స్పందించాలి

సొంత ఇల్లు అనేది ప్రతి పేదవాడి కల. అది సాకారం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అయితే గత ప్రభుత్వంలో అధికారుల తప్పిదాలు, స్థానిక వైసీపీ నాయకుల అత్యుత్సాహం, పలువురి అవినీతి ఇలా కారణాలేమైనా పేదలకు మాత్రం నష్టం జరిగిపోయింది. ఇళ్ల నిర్మాణాల పేరుతో డబ్బులు తిన్న ఘనులు ప్రస్తుతం కూటమి జెండాల మాటున రక్షణ పొందుతున్నారు. దర్జాగా తిరుగుతున్నారు. తప్పుడు బిల్లులు చేసి అవినీతికి సహకరించిన అధికారులు తాపీగా ఉన్నారు. అన్ని విధాలా నష్టపోయింది పేదలే. ఈ పేదల విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. మానవతా దృక్పథంతో వీరికి న్యాయం చేయాలి. నిబంధనలు సడలిస్తారో, డబ్బులు తిన్న కాంట్రాక్టర్ల చేత కక్కించి న్యాయం చేస్తారో! ఏవిధంగానైనా పేదలకు న్యాయం జరగాలి. తరతరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కలకు తమను శాశ్వతంగా దూరం కానివ్వకుండా న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అల్లూరు : శ్లాబు దశలోనే నిలిచిన ఇంటి నిర్మాణం



ర్యాలీలో పాల్గొన్న యువత

జయహో ఛత్రపతి

ఘనంగా శివాజీ జయంతి • కదం తొక్కిన హిందూ సంఘాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 496వ జయంతిని బుధవారం నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ అనుబంధ మోర్చాల రాష్ట్ర ఇన్‌చార్జి పీ సురేందర్‌రెడ్డి దీనిని ప్రారంభించారు. తొలుత మరాఠా మిత్రమండలి ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు చేశారు. శివాజీ విగ్రహాన్ని గజమాలతో అలంకరించి నివాళులర్పించారు. సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ శివాజీ పోరాటమే భారత స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తి అన్నారు. విదేశీ ముష్కరులు భారతదేశాన్ని కొల్లగొడు తుంటే తల్లి జిజియా బాయి, తుల్జాపూర్ భవానీ మాత ఆశీస్సులతో వీరోచితంగా పోరాడారని కొనియాడారు. యువత శివాజీ ఆశయాలను, ఆదర్శాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లలో జరిగే ఆయన 500వ జయంతిని అన్నీ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, మారాఠా మిత్ర మండలి అధ్యక్షుడు దేవ దాస్ జాదవ్, సందీప్ పాండురంగ, సంఘ సేవకుడు ఎన్‌వీ సుబ్బారావు, శివాజీ సెంటర్ ప్రముఖులు కేవీ సుబ్రహ్మణ్యం, పీ సత్యనాగేశ్వరరావు, బీ ఎస్ రంగరాజన్, మధుసూదన్, బాలసుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శివాజీ జయంత్యుత్సవంలో భాగంగా నిర్వహించిన చైతన్యర్యాలీ వైభవంగా జరిగింది. దేశభక్తి నినాదాలతో, కాషాయ జెండాలతో హిందూ సంఘాలు కదం తొక్కాయి. ఈ ర్యాలీ వైఎంసీఏ గ్రౌండ్ నుంచి ట్రంకురోడ్డు మీదుగా నర్తకిసెంటర్‌కు అక్కడి నుంచి మళ్లీ వైఎంసీఏ గ్రౌండ్‌కు చేరింది. చిన్నారులు జాతీయ నాయకుల వేషధా రణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, అనుబంధ సంఘాలు, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు. శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, కన్వీనర్ అశోక్‌నాయుడు, కార్యదర్శి మధురెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

ఐటీడీఏ పీవోగా మల్లికార్జునరెడ్డి

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారిగా మల్లికార్జునరెడ్డి నియమి తులయ్యారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయనకు అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి కలిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఐటీడీఏ పీఓగా నియమిస్తూ కూటమి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

24న పీఎం కిసాన్ విడుదల

నెల్లూరు (వ్యవసాయం) : పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా అందిస్తున్న సాయాన్ని 24వ తేదీన రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. 2024-25 సంవత్సరానికి గాను 19వ విడత నిధులు జిల్లావ్యాప్తంగా 1.68 లక్షల మంది రైతులకు అందనుంది. రూ.2వేల చొప్పున మొత్తం రూ.33.52 కోట్లు రైతుల ఖాతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ జమ చేయనున్నారు.

సంగంలో జీబీఎస్ అనుమానితుడు

• వ్యాధి లక్షణాలతో జీజీహెచ్‌లో చేరిక • నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు



అరవపాళెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కలకలం రేపుతున్న గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) లక్షణాలతో సంగం మండలం జెండాదిబ్బ పంచా యతీలోని పుట్టవారి కడ్రిగలో ఓ వ్యక్తి నెల్లూరు లోని జీజీహెచ్‌లో చేరారుడ. ఆ మేరకు బాధితుడికి రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు వైద్యాధికారులు శ్రీనివాసులురెడ్డి, అశోక్ ఆధ్వ ర్యంలో క్షేత్రస్థాయి వైద్య, పంచాయతీ సిబ్బందితో గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి లార్వా, ఫీవర్ సర్వే ముమ్మ రంగా చేస్తున్నారు. జీబీఎస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారివెంట సర్పంచ్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

సర్వర్ డౌన్


• ఆగిన రిజిస్ట్రేషన్లు • కార్యాలయం వద్ద జనం పడిగాపులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ బుధవారం మొరాయించడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు నగరంలోని ప్రధాన కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో వారు వేచి ఉండలేక, బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ బుధవారం సప్తమితిథి (మంచిరోజు) కావడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. సర్వర్ మొరాయించడంతో ప్రక్రియ ఆగిపోయింది. నగరంలోని ప్రధాన కార్యాలయంలో ప్రతిరోజూ 10 నుంచి 40 వరకు దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మంచితిథి కావడంతో వందకుపైగా రిజిస్ట్రేషన్ల కోసం జనం వచ్చారు. భూములు, స్థలాల మార్కెట్ విలువలు ఇటీవల పెరగడంతో రిజిస్ట్రేషన్ చేసుకునేవారి సంఖ్య తగ్గింది. దీనికితోడు తరచూ సర్వర్ మొరాయింపుతో ఆ శాఖ ఆదాయానికి గండి పడుతోంది. రిజిస్ట్రేషన్ల కోసం నగదు చెల్లించి గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడడంతోవారు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందే రిజిస్ట్రేషన్ ఫీజు నగదు కట్టించుకుని, రిజిస్ట్రేషన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. రిజిస్ట్రేషన్ చేసేవారు, చేయించుకునే వారితోపాటు సాక్ష్యులు కూడా వచ్చారు. సర్వర్ సమస్యతో వారు కూడా విసిరి వేసారిపోయారు. తరచూ మొరాయిస్తున్న సర్వర్ విషయంలో ఆశాఖ ఉన్నతాకారులు సరైన చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సర్వర్ సమస్యను పరిష్కరించి, రిజిస్ట్రేషన్లు సకాలంలో జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

గెలిచినా.. ఓడుతున్నారు!

• న్యాయపరంగా భూమి ఇవ్వడంలో తీవ్ర జాప్యం
• జిల్లాలో వంద కుటుంబాలకు తీరని వేదన
• ముప్పుతిప్పలు పెడుతున్న రెవెన్యూ శాఖ





మాజీ సైనిక ఉద్యోగులకు తప్పని తిప్పలు

కావలికి చెందిన ఓ వ్యక్తి సుమారు 20 ఏళ్ల పాటు ఆర్మీలో సేవలందించారు. పదవీ విరమణ పొందాక న్యాయపరంగా తనకు ఇవ్వాల్సిన భూమి కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. కానీ ఎవరూ కనికరించలేదు. చివరకు డబ్బులు ఖర్చు చేస్తే గానీ తనకు న్యాయం దక్కదని గ్రహించిన ఆ మాజీ సైనికోద్యోగి ఏఎస్‌పేట మండలంలో భూమిని చూసుకున్నారు. అయినా భూమి దక్కలేదు. సుమారు ఇరవై ఏళ్లపాటు రెవెన్యూ వ్యవస్థతో పోరాడి గతేడాది తనువు చాలించారు. ఇప్పుడు ఆయన కుటుంబ సభ్యులు తమకు భూమిని కేటాయించి ఆదుకోవాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

నెల్లూరుకు చెందిన మరో మాజీ సైనికోద్యోగి ఆరేళ్ల క్రితం పదవీ విరమణ చేసి భూమి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. రెవెన్యూ సిబ్బంది భూమి చూపించాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా మీరే భూమి చూసుకోండి అంటూ ఆ మాజీ సైనికో ద్యోగితో ఆడుకుం టున్నారు. ఉన్నతా ధికారులకు కూడా అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని సదరు ఎక్స్ సర్వీస్‌మన్ ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

కలెక్టర్ గారూ.. కనికరించండయ్యా!

మట్టెం వెంకటేశ్వర్లు అనే మాజీ సైనికోద్యోగి తన హక్కు కోసం ఇరవై ఏళ్ల పాటు పోరాటం చేసి చివరకు ఫలితం సాధించకుండానే తనువు చాలించిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగిస్తోంది. ఆఖరుకు హైకోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నా ఈ ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇప్పటికీ న్యాయం జరగలేదంటే జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎక్స్ సర్వీస్ మెన్లకు భూమిని కేటాయించే విషయంలో రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉంటోంది. ఒక వ్యక్తి భూమి కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాక అతను అర్హుడా కాదా అన్నది వారు నిర్ధారించుకోవాలి. జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి అన్ని ఆధారాలు తీసుకొని సదరు వ్యక్తికి భూమిని చూపించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా ఎక్కడ ఖాళీ భూమి ఉందో మీరే చూసుకొని రండి.. అంటూ కింది స్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఎక్కడ భూమి ఉందన్న విషయం మాజీ సైనికులకు ఎలా తెలుస్తుంది? అని ప్రశ్నిస్తే మాత్రం రెవెన్యూ ఉద్యోగుల నుంచి సమాధానం రావడం లేదు. ఒక వేళ తంటాలు పడి ఫలానా చోట భూమి ఖాళీగా ఉందని ఎక్స్‌సర్వీస్‌మెన్‌లు తెలుసుకుని వచ్చినా ఫైల్ కదలడానికి అనేక కొర్రీలు పడుతున్నాయి. అన్ని చేరి ఆ ఫైల్ ఆర్డీవో కార్యాలయానికో లేక కలెక్టరేట్‌కో వస్తే.. ఇక్కడ దానిని పట్టుకోవడం చాలా కష్టంగా మారుతోందని ఎక్స్‌సర్వీస్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది సమాధానం కూడా చాలా నిర్లక్ష్యంగా ఉంటోందని వాపోతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరి ఫైల్ ఏ స్థాయిలో ఉందో కూడా తెలియడం లేదని చెబుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు జోక్యం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

జిల్లాలో మాజీ సైనికోద్యోగ కుటుంబాలు సుమారు వంద వరకూ ఉన్నాయి. 'మాకు భూమిని కేటాయించి జీవనాధారం చూపించండయ్యా..' అంటూ రెవెన్యూ సిబ్బంది చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాయి. దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి శత్రువులతో పోరాటం చేసి వచ్చిన సైనికులు.. తమ ఫలాలను సాధించుకోవడంలో మాత్రం విజయం సాధించలేకపోతున్నారు. అక్కడ శత్రువులతో పోరాటం చేసిన దేశభక్తులు ఇక్కడ రెవెన్యూ వ్యవస్థతో పోరాటం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాజీ సైనిక ఉద్యోగులకు ఐదెకరాల సాగు భూమి ఇవ్వాలి. రక్షణ వ్యవస్థలో పనిచేసి వచ్చాక వారికి మరో పని తెలియదు కాబట్టి వారు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తారన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అంతటి గొప్ప వ్యక్తులకు జిల్లాలో మాత్రం న్యాయం జరగడం లేదు. జిల్లాలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా అందులో నుంచి ఐదెకరాలను మాజీ సైనికులకు ఇవ్వడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. తహసీల్దార్ కార్యాలయాల స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, జిల్లాస్థాయిలో పట్టించుకోకపోతుండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఉర్దూ పాఠశాలను విలీనం చేయొద్దు

లింగసముద్రం మండలం పెదపవని ముస్లిం కాలనీలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలోని 6,7,8 తరగతులను స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేయవద్దని మాజీ సర్పంచు సయ్యద్ నాయబ్‌రసూల్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ ఉబేదుల్లా, పాఠశాల కమిటీ సభ్యులు, తలిదండ్రులు, బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, మండలంలోని ఏకైక ఉర్దూ పాఠశాలను విలీనం చేస్తూ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తీసుకోవా లని డిమాండ్ చేశారు. కాలనీలో సుమారు 400 ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, తమ పిల్లలంతా చదువుకోవడానికి మండలంలో ఉన్న ఏకైక ఉర్దూ పాఠశాల ఇదేనని చెప్పారు.దీన్ని విలీనం చేస్తే తమ పిల్లలు డ్రాప్ అవుట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. యథావిధజగా ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

-లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

మద్దతు ధర కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు

బుచ్చిరెడ్డిపాళెం : ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని జేసీ కే. కార్తీక్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని రేబాలలో రైతు సేవా కేంద్రాన్ని ఆర్ఎస్‌కే జిల్లా కోఆపరేటివ్ అధికారి గుర్రప్పతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, వీపీఏలు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణం తెరవనీయం!

స్థానిక గిడ్డంగివారి వీధిలో మద్యం దుకాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో తెరవనీయం అంటూ బుధవారం సాయంత్రం మహిళలు ఆందోళన చేశారు. కలువాయి మండలానికి గీత కార్మికుల కోటాలో కొత్తగా మంజూరైన మద్యం దుకాణాన్ని చిలుకూరి ప్రసాద్ ఇంట్లో తెరిచేందుకు నిర్వాహకులు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే ఇరుకుగా ఉండే మా వీధిలో మద్యం దుకాణం వద్దు అంటూ ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులకు కాలనీ వాసులు వినతిపత్రాలు అందజేశారు. ఈనేపథ్యంలో బుధవారం సాయంత్రం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్న గది ముందు మహిళలు ఇక్కడ మద్యం దుకాణం పెట్టవద్దు అంటూ ఆందోళన చేశారు.

-- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

కలంకారీ... పురాతనమైన కళ. సహజ సిద్ధమైన రంగులతో వస్త్రాలపై పురాణ, ఇతిహాసాలను హృద్యంగా దృశ్య రూపంలో చెప్పే అరుదైన విద్య. ఈ కళతో రూపొందించిన వస్త్రాలతో దేవాలయాల్లోని రథాలను తీర్చి దిద్దుతారు. ప్రభలను తయారు చేస్తుంటారు. రాజుల కాలంలో ఎక్కువగా కలంకారీ వస్త్రాలే వినియోగించేవారు. రాజప్రాసాదాల్లో రాచరికపు ఠీవిని ఇవి మరింత ద్విగుణీకృతం చేసేవి. కాలక్రమేణ ఈ విద్యలో ప్రావీణ్యం ఉన్న కళాకారులు తగ్గిపోయారు. ప్రస్తుతం దేశంలోని అనేక ప్రాంతాల్లో కలంకారీ పేరుతో బ్లాక్ ప్రింటింగ్‌తో చేసిన వస్త్రాలు విక్రయిస్తున్నారు. కానీ, నిన్నటితరం అసలు సిసలైన కలంకారీ కళాకారుడు విన్నకోట వీర రాఘవయ్య. వారసత్వంగా అబ్బిన కళకు తన సృజనను జోడించి కళ్లు చెదిరే కళాఖండాలను సజీవంగా సాక్షాత్కరిస్తున్నారు. స్వతహాగా తయారు చేసుకున్న రంగులతో ఎందరివో చరిత్రలకు చిత్రరూపమిచ్చి కింగ్ ఆఫ్ కలంకారీగా నిలుస్తున్నారు.

ప్రభళ రాఘవ


అద్దంకి రామలింగేశ్వరాలయం రథానికి వీరరాఘవయ్య చేసిన కళంకారి వస్త్రం


కాటమరాజు చరిత్ర చెబుతున్న కలంకారీ కళాఖండం


చాందినీ వస్త్రంపై రాఘవయ్య రూపొందించిన సీతారాముల కల్యాణ ఘట్టాలు

- అరుదైన కలంకారీ కళాకారుడు వీరరాఘవయ్య
- ఆలయాలకు ప్రభల తయారీలో దిట్ట
- సహజసిద్ధ రంగులతో రూపకల్పన
- 50 ఏళ్లుగా ఎన్నో కళాఖండాలకు జీవం
- ఢిల్లీ మ్యూజియంలో గంగచరిత్ర ప్రభ
- మలి వయసులో ఒంటరితనం
- వృద్ధాప్య పింఛనుతో జీవనం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇనమనమెల్లూరు గ్రామంలో విన్నకోట ఆదిశేషయ్య, చిన్న కోటమ్మకు 1949లో వీరరామవయ్య జన్మించారు. తండ్రి కలంకారీ కళాకా రుడు కావడంతో బాల్యం నుంచే ఈ కళపై మక్కువ పెంచుకున్నారు. ఐదో తరగతి వరకే చదువుకున్న రాఘవయ్య ఆ తర్వాత తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ కలంకారీలో మెలకువలు నేర్చుకున్నారు. వృత్తి రీత్యా 1972లో కుటుంబంతో నెల్లూరుకు వచ్చేశారు. కొంతకాలం నవాబుపేటలో కాపురం ఉన్నారు. అనంతరం వెంకటేశ్వరపురంలో స్థిరపడ్డారు. తండ్రి మరణానంతరం కలంకారీ కళనే వృత్తిగా, జీవనోపాధిగా మార్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక దేవాలయాల రథాలకు ప్రభలను తయా రు చేశారు. గంగ పటములు, కాటమరాజు, మనుమసిద్దిరాజుల చరిత్రలు చిత్ర రూపంలో చెప్పడంతో దిట్టగా గుర్తింపు పొందారు. సీతారాముల కల్యాణం, సంపూర్ణ రామాయణం, శ్రీకృష్ణ లీలలు, మనుచరిత్ర... ఇలా అనేక పురాణ, ఇతిహాస గాధలతో ప్రభలను తయారు చేసి మంచి పేరు తెచ్చుకొన్నారు. వీరరామవయ్య ప్రాణం పోసిన గంగచరిత్ర, మనుచరిత్రల ప్రభల వస్త్రం ఇప్పటికీ ఢిల్లీ మ్యూజియంలో ఉండటం విశేషం. ఇలా గత 50 సంవ త్సరాలుగా కలంకారీ కళాకారుడిగా ఎన్నో అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు. దాదాపు 15 ఏళ్ల డీఆర్‌డీఏ ద్వారా వేలాది మంది మహిళ లకు కలంకారీ కళలో శిక్షణ ఇచ్చారు.



అన్నీ చేతితోనే...

అన్నీ రంగాల్లో యాంత్రీకరణ పెరిగి పోయి నాణ్యత తగ్గిపోతున్న రోజుల్లో విన్నకోట వీరరాఘవయ్య కలంకారీ వస్త్రాల తయారీని చేతితోనే చేస్తు న్నారు. దీనికి అవసరమైన రంగులను కూడా తానే సొంతంగా తయారు చేసుకుంటారు. ముందుగా వస్త్రంపై బొమ్మలు గీసుకొని అనంతరం కలంకారీ ఆర్ట్ వేస్తారు. ఇలా ఆయన తయారు చేసిన రథం ప్రభలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక దేవాలయాల్లో నేటికీ దర్శనమిస్తున్నాయి. కొటప్పకొండ, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ దేవస్థానాలు, బ్రహ్మంగారి మఠం, ఉప్పుకొందూరు ఆలయాలతోపాటు అనేక దేవాలయాలకు ప్రభలు, గంగపటాలను అందించారు. సహజ సిద్ధమైన రంగులు వాడటం, చిత్రాలు సజీవంగా దర్శనమిస్తుండటంతో ఇప్పటికీ రాఘవయ్యకు ఆర్డర్లు వస్తున్నాయి. అయితే వృద్ధాప్య కారణంగా శరీరం పట్టుతప్పడం, ఈ కళను నేర్చుకునే వారసులు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.


కృష్ణలీల చిత్రం...

ఇప్పటికీ ఆర్డర్లు వస్తున్నాయి



వయసు పెరిగిపోయి ఒంటిలో శక్తి తగ్గిపోవడంతో గతంలో మాదిరిగా పని చేయలేకున్నాను. ఇప్పటికీ రెండు రాష్ట్రాల నుంచి అనేక దేవాలయాల వాళ్ల ప్రభలు, గంగపటముల ఆర్డర్లు ఇస్తున్నారు. భార్య చనిపోయింది. ఉన్న ఒక్క కూతురికి పెళ్లి చేసి అత్తంటికి పంపించాను. ప్రస్తుతం వెంకటే శ్వరపురంలోని టిడ్కో ఇళ్లలో ఉంటున్నాను. ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పింఛనుతో జీవనం సాగిస్తున్నాను.

- వీరరాఘవయ్య

ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ఇస్తిమాకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు
- అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతి ఆదేశం

కొడవలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగడిచెలిక వద్ద ఈ నెల 22 నుంచి జరగనున్న తబ్లిగ్ జమాత్ రాష్ట్రస్థాయి ఇస్తిమాకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 2లక్షల మందికిపైగా భక్తులు పాల్గొనే ఇస్తిమా మైదానంలో టెంట్లు, స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్తిమా నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఫైర్, శానిటేషన్, పోలీసు తదితర శాఖల అధికారులను ఆదేశించారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇస్తిమా గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఓ స్టాల్‌ను ఏర్పాటు చేసి భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. ఇస్తిమా నిర్వాహకులకు స్థానిక టీడీపీ నాయకులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు జాకీర్, షరీఫ్, ఇంతియాజ్, టీడీపీ నాయకులు సతీష్, కమలాకర్‌రెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.17.4 లక్షల గంజాయి స్వాధీనం


గంజాయి రవాణాకు వినియోగించిన ట్రక్కు ఆటో

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు ట్రక్కు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.17.40 లక్షల విలువైన 174 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... మంగళవారం రాత్రి వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ39వీఏ9012 నెంబరు గల ట్రక్కు ఆటో పోలీసులను గమనించి వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా గుర్తించిన పోలీసులు ఆటోను వెంబడించి పట్టుకున్నారు. దానిని పరిశీలించగా అందులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న అన్నమయ్య జిల్లా చినమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ, రాజమ్మ దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నట్లు వెలుగు చూసింది. దీంతో ఆటోతో పాటు గంజాయిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో పరిశీలించగా 90 ప్యాకెట్లలో 174 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.17.40 లక్షలు ఉంటుందని, మరో ముగ్గురు పరారయ్యారని పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, ఎస్ఐ అంజనేయులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

- పశుసంవర్ధక శాఖలో కీలక పోస్టు కోసం పోటీ
- కూటమి ప్రభుత్వం రాకతోనే డిమాండ్

కుర్చీ కోసం కుస్తీ

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరులోని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో అదో కీలకమైన కుర్చీ. అక్కడ కూర్చొనేవారిని టెక్నికల్ ఆఫీసర్, నోడల్ అధికారి, స్టోర్ రూం ఇన్చార్జి ఇలా ఎవరికి నచ్చినట్లు వారు పిలుస్తుంటారు. జేడీని కలవాలన్నా, ముఖ్యమైన ఫైళ్లపై సంతకాలు చేయాలన్నా, శాఖా పరంగా ఇంకేమైనా ఉన్నా మొదటగా ఆ కుర్చీలో కూర్చొనే వ్యక్తిని కలవాలన్నది అక్కడి ఆచారం. ఒకరకంగా చెప్పాలంటే షాడో జేడీ అన్న మాట. జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలలకు అవసరమైన మందులు, పశు దాణా పంపిణీ వంటి ముఖ్యమైన స్కీముల పర్యవేక్షణ బాధ్యత ఈ అధికారిదే. ఇంకా చెప్పాలంటే అధికారులు, వైద్యులు, సిబ్బంది పనితీరును జేడీ దృష్టికి తీసుకెళ్లడం, డిప్యూటేషన్లు వంటి విషయాల్లో కీలకపాత్ర పోషిస్తుంది. ఇంతటి ప్రాధాన్యమైన సీటు అది.



బడ్జెట్ పెరగడమే కారణమా?

గతంలో పశువులకు అవసరమైన మందులు, ఇంజక్షన్లు, దాణా వంటివి జిల్లా అవసరాల మేరకు ప్రభుత్వం జిల్లాకు ఓ బడ్జెట్ కేటాయించేది. అయితే గత వైసీపీ హయాంలో ఈ పద్ధతిలో మార్పులు తెచ్చారు. మండ లాల వారీగా ఆయా ప్రాంతాల అవస రాలను బట్టి ఏ మందులు అవసరమో అక్కడి వైద్యులు ఆన్‌లైన్‌లో వారికి కేటాయించిన బడ్జెట్‌లో ఆర్డర్లు పెట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గత ఐదేళ్లలో ఈ సీటు కోసం ఎవరూ పోటీ పడలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ఈ సీటుపై అందరి కన్ను పడింది. పాడిపరిశ్రమకు అధికంగా బడ్జెట్ కేటాయింపులు ఉంటాయనేది ఒక కారణంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాకు క్వార్టర్‌కు (3 నెలలు) రూ.కోటి మందులకు కేటాయించింది. అది కూడా ఒక క్వార్టర్‌కు కేటాయిస్తే మరో క్వార్టర్‌కు కేటాయింపులు ఉండేవి కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక క్వార్టర్‌కు దాదాపు రూ.1.96 కోట్ల బడ్జెట్ కేటాయిస్తోంది. అంతేగాక గోకులాలకు ఎంతో ప్రాధాన్యమిస్తోంది. అనేక పథకాలకు బడ్జెట్ కేటాయింపులు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఈ సీటుకు ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పోటీ అనివార్యమైందని ఆ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బందే బహిరంగంగానే మాట్లాడుతున్నారు.

2 నెలలకే మరొకరికి ఆర్డర్?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదేళ్ల నోడల్ అధికారిగా పని చేసిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌ను (వీఏఎస్) డిప్యుటేషన్ సమయం ఉన్నా ప్రభుత్వం మరో వీఏఎస్‌ను కేటాయించింది. వైసీపీ మద్దతుదారుడిగా ముద్ర పడిన ఆయన్ను అక్కడ నుంచి రెగ్యులర్ పోస్టుకు కాకుండా మరోచోటకు డిప్యూటేషన్ వేయడం చర్చనీయాంశమైంది. మొత్తం మీద అతనికి ఉన్న రాజకీయ పరిచయాలతో రెగ్యులర్ పోస్టుకు వెళ్లిపోయారు. కాగా, మంత్రి సిఫారసుతో ఆ సీటులోకొచ్చిన మరో వీఏఎస్‌కు ఆదిలోనే అవరోధం ఎదురైంది. కనీసం రెండు నెలలు కూడా పూర్తికాక ముందే మరో వీఏఎస్‌ను ఆ సీటుకు డిప్యూటేషన్ వేసినట్లు సమాచారం. మంత్రి సిఫారసుతో వచ్చిన ఆ వీఏఎస్‌ను నెల్లూరు డివిజన్‌కు డిప్యూటేషన్ వేసినట్లు తెలుస్తోంది. ఇది కూడా పెద్ద చర్చ నడుస్తోంది. మొత్తం మీద కీలకమైన ఆ పోస్టు కోసం పశుసంవర్ధక శాఖలో కనిపించని కుస్తీ పోటీ జరుగుతోంది.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగుల నుంచి సీఐఎస్ఎఫ్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ కానిస్టేబుల్ డ్రైవర్స్ అండ్ డీసీపీవో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించారని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ పూర్తి చేసి ప్రభుత్వ రంగంలో ఉపాధిని కోరుకునే వారికి ఇది మంచి అవకాశమని తెలిపారు. పూర్తి వివరాలకు https://cisfrectt.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. మార్చి 4వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో..

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో పోస్టుల భర్తీకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఉపాధి అధికారి తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు https://ioci.com/latest-job-opening వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. దరఖాస్తుకు ఈ నెల 23 ఆఖరని తెలిపారు.

నేడు లంకా దినకర్ రాక

నెల్లూరు (హరనాథపురం) : ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ గురువారం నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 21వతేదీ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడుతారని అధికార వర్గాలు ప్రకటించాయి.

రేపు విజయకుమార్..

మాల సంక్షేమ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ పెద్దపూడి విజయకుమార్ శుక్రవారం నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 22వతేదీ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడుతారని అధికారులు పేర్కొన్నారు. అలాగే, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా 21వతేదీ జిల్లాకు రానున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

సుబ్బయ్య బడి చరిత్రలో నిలిచిపోతుంది : ఎమ్మెల్యే కావ్య

అల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ కాలంలో తెలుగు పాఠశాలగా ఏర్పాటై నేడు నూరేళ్ల పంటగా నిలిచిన సుబ్బయ్యబడి చరిత్రలో నిలిచిపోతుందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా కష్టపడాలన్నారు. 25 ఏళ్లక్రితం ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విద్యార్థులను చూసి, అప్పుడే ఎమ్మెల్యే కావాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తాననుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానన్నారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి అమర్‌రెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు, అరగల రమణయ్య, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పల్లెల అభివృద్ధి

నెల్లూరు(వ్యవసాయం, ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోపిరెడ్డి పావని పేర్కొన్నారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో పాలకులు, అధికారులు స్థానిక సంస్థలను పట్టించుకోలేదని, సర్పంచుల ఖాతాల్లోని నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. కానీ, కూటమి ప్రభుత్వంలో సర్పంచుల ఖాతాల్లో నిధులు వేసి పల్లెల అభివృద్ధికి బాటలు వేశారని, ప్రజాప్రతిధులకు గౌరవం లభిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు గౌరవం కరువైందని వైసీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో నరుకూరు ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబు, సర్పంచుల సంఘం నాయకులు ఉయ్యాల భాస్కర్, చిట్టేటి కవిత, చేవూరు శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్, గూడూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రోచ్చరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని తిలకించారు. పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

వింజమూరు : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను బుధవారం ఆయన పరిశీలించి వైద్యులకు, సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. అలాగే అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల డీడీఓ కార్తీక్, వైద్యులు మధుసూదన్, మసూద్, శ్వేత, సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఎమ్మెస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కావలిని కాస్మోసిటీగా మారుస్తా : ఎమ్మెల్యే కావ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో కావలిని కాస్మోసిటీగా మారుస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని స్వర్ణకారుల సంఘం కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఏవీఎస్ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వర్ణకారుల భవనానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 600 దుకాణాల నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. తొలుత స్వర్ణకారుల సంఘం కమిటీ చేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీని, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు వీ. నటరాజాచారి, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఈనెల 20వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించే ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డులు నమోదు చేయడం, తప్పులు సవరిచడం, మార్పులు చేయడం జరుగుతుందన్నారు. 20వ తేదీన అనుమసముద్రం, గుడిపాడు, చిరమన, 21న శ్రీకొలను, రాజవోలు, 22న జమ్మవరం, కొండమీదకొండూరు, ఏఎస్ పేట, 24న గుంపార్లపాడు, పెద్దాబీపురం, 25న కావలి ఎడవల్లి, చౌటభీమవరం, 21నుంచి 25వ తేదీ వరకు ఏఎస్‌పేట సచివాలయలో శిబిరాలను నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్టీలకు న్యాయం చేయాలి



సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి బ్రహ్మయ్య

కందుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండికందుకూరు కుంటపోరంబోకులో నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు సరైన ప్రదేశంలో నివాసస్థలాలు కేటాయించి, పక్కాగృహాలు మంజూరు చేయాలని సర్పంచి కుమ్మర బ్రహ్మయ్య సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు బుధవారం విజ్ఞప్తి చేశారు. సర్వేనెం 146-2లో 4.17 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఉందని, ఆ భూమిలో కొన్నేళ్లుగా 30 యానాదుల కుటుంబాలు జీవిస్తున్నారని తెలిపారు. అయితే కుంటపోరంబోకులో పక్కాగృహాల మంజూరుకు సాంకేతికంగా ఇబ్బందులు ఉండటంతో వారు పూరిగుడిసెల్లోనే నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్టీ కుటుంబాల వారికి నివాసయోగ్యమైన చోట స్థలాలు ఇచ్చి పక్కాగృహాలు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీదేవి చౌదరి పుస్తకాల ఎంపిక

కావలి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు గుంటుపల్లి శ్రీదేవిచౌదరి రచించిన కమ్యూనికేషన్ అండ్ స్కాఫ్ట్ స్కిల్, బిజినెస్ కమ్యూనికేషన్.. అనే రెండు పుస్తకాలను ఏపీ ప్రభుత్వ పౌర గ్రంథాలయశాఖ ఎంపికచేసింది. 2022-23 లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆమోదం పొందిన పుస్తకాల వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో శ్రీదేవి చౌదరికి అరుదైన గౌరవం దక్కింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రాజకుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ ఉమ, అధ్యాపకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రేపు మాలకొండలో వేలం పాటలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాలకొండ ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు దుకాణాలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. ఈనెల 7న జరిగిన వేలంలో పాటదారుల నుంచి స్పందన లేనందున వాయిదా వేసిన సంగతి తెలిసిందే. దీంతో తిరిగి వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రజక మాన్యం స్థలాన్ని కాపాడాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రజక కాలనీ వాసులు

సీతారామపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రజక మాన్యం స్థలాన్ని కాపాడాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రజక కాలనీవాసులు బుధవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాములవారి గుడి నిర్మాణానికి ఉంచిన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, గతంలో రజక కాలనీలో ఉండి ఇళ్లను అమ్ముకొని పోయినవారు తిరిగి కాలనీకి వచ్చి ఖాళీగా ఉన్న రజక మాన్యం స్థలాన్ని ఆక్రమించుటకు కర్రలు పాతారని, గుడి కోసం ఉంచిన స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరారు.

వెంటాడుతున్న పశుగ్రాసం కొరత

పాడిరైతుల అవస్థలు



మేత కోసం వలస పోతున్న ఆవులు

మర్రిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగ్రాసం కొరతతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. పశుసంవర్ధక శాఖ గణాం కాల ప్రకారం మండలంలో 3238 ఆవులు, 21,858 గేదెలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 4వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈక్రమంలో పాడి పశువులకు పశుగ్రాసం దొరక్క అవస్థలు పడుతున్నారు. గతంలో వరి పంటను కూలీలు కోసేవారు. దీంతో గడ్డి పుష్కలంగా దొరికేది. కాగా, వరికోతకు యంత్రాలను వాడడంతో పశువులకు ఎండు గడ్డి దొరకటం లేదు. ట్రాక్టరు వరిగడ్డి రూ. 12వేలు పలుకుతోంది. దూర ప్రాంతాల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో రవాణా ఖర్చులు మరింత భారంగా మారుతున్నాయి. గతంలో ప్రతీ ఏటా మినుము, ఉలవ, పెసర వంటి పంటలు సాగు చేస్తుండటంతో ఎంతో కొంత గ్రాసం దొరికేది. రెండేళ్ల నుంచి రైతులు మిరప, బొప్పాయి వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రాసం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. గత ప్రభుత్వం గ్రాసాల క్షేత్రాల పెంపకానికి రైతులకు సహకరించక స్వస్తి పలకడంతో పశుపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో పశుసంపదను కాపాడుకునేందుకు ఇళ్లను వదిలి జీవాలను వెంట బెట్టుకుని సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, తొలకరి జల్లులు కురిసేంతవరకు కుటుంబాలను వదిలి అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పశుపోషకులు వాపోతున్నారు.

సనాతన ధర్మం కోసం పోరాడిన ఛత్రపతి శివాజీ



ఉదయగిరి : శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్కంధపురి ఉద్యానవనం సమీపంలోని భజరంగీ సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పామూరు రోడ్డు కూడలి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో హిందువులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఖండ్ సంచాలక్ డాక్టరు తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ నేటికీ సనాతన ధర్మం, హిందూ దేవాలయాలు ఉన్నాయంటే, అది శివాజీ పోరాట ఫలితమేనని గుర్తుచేశారు. ర్యాలీలో శివాజీ వేషధారణలో చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

●ఉదయగిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు నెల్లూరు వెంకటస్వామినాయుడు, ఆవుల రోశయ్యయాదవ్, మోటపోతుల చెన్నయ్య, చల్లా సుబ్బరత్నం, దుగ్గయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

●సంగం: తరుణవాయి గిరిజన కాలనీ పాఠశాలలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, బాలబ్రహ్మం, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తుల పరిశీలన



ఆత్మకూరు : దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంకు మేనేజర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, కమ్మ, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్లు ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, మండల పరిషత్ సిబ్బంది పరిశీలించారు. మండలంలో మొత్తం 200 మంది దరఖాస్తు చేసుకోగా 165 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మొత్తం 46 రుణాలు మంజూరయ్యాయన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులను ఎంపిక చేసి బ్యాంకు రుణాలు మంజూరుచేయబడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఏపీజీబీ, ఎస్‌డీసీ బ్యాంకుల మేనేజర్లు, మండల పరిషత్ పాలన అధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●దుత్తలూరు(ఉదయగిరి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రుణాలకు మండలంలో 248 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 140 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

●వింజమూరు:సబ్సిడీ రుణాల మంజూరు కోసం అందిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. మొత్తం 377 దరఖాస్తులు పరిశీలించినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ దరఖాస్తులను పునఃపరిశీలించి బ్యాంకర్ల సమక్షంలో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

●కలువాయి: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం మండలం అన్ని గ్రామాల నుంచి ఆన్‌లైన్ ద్వారా 407 దరఖాస్తులు అందినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. ఈనెల 25వ తేదీ ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్ల సమక్షంలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని చెప్పారు. దరఖాస్తుదారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

●అనంతసాగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 267 మంది దరఖాస్తు చేసుకోగా 208 మంది హాజరైనట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.

●కొండాపురం : మండలంలో రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముందుగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు, సాయిపేట యూనియన్ బ్యాంకు పరిధిలో 52 మంది, కొమ్మి ఏపీజీబీ పరిధిలో 58 మంది అభ్యర్థులు హాజరయినట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో సాయిపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ సంతోష్‌కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● నేడు బోగోలులో...

బిట్రగుంట : బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాయితీ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు ఉదయం నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. హాజరయ్యేవారు రేషన్, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌పుస్తకం ఒరిజినల్స్ తీసుకురావాలని తెలిపారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమ ఆధార్, పాన్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో ఉదయం 11గంటలకు తప్పక హాజరు కావాలని కోరారు.

బాలికల హాస్టల్‌లో భద్రతపై పరిశీలన

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో బాలికల భద్రతపై ఎస్ఐ రాజేష్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం అందిచాలన్నారు. బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వసతి గృహ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

'చిన్నపంతులు'కు ఘనంగా వీడ్కోలు

కందుకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చిన్నపంతులుగా గుర్తింపు పొందిన కళాకారుడు, సినీనటుడు చిమ్మిలి మాలకొండయ్యకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించి, అంతిమ వీడ్కోలు పలికారు. లింగసముద్రం మండలం వీఆర్ కోటలో చిన్నపంతులు గుండెపోటుతో మృతి చెందగా బుధవారం మలినేని విద్యాసంస్థల చైర్మన్, సినీనటుడు మలినేని లక్ష్మయ్య, నిర్మాత, రచయిత ఉప్పు రమేష్ తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో అప్పాజీ సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. సర్వేలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. మార్చి నెలాఖరు నాటికి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. రుణాలకు 322 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 200 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు నాగూర్‌బీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రవికుమార్ సూచించారు. బుధవారం వరికుంటపాడు, విరువూరు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా జారీచేస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాంటి వారికి మాత్రమే పీఎం కిసాన్ నగదు, ఇతర పథకాలు వర్తిస్తాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, ఫోన్ నంబర్లతో ఈనెల చివరి నాటికి రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సిబ్బంది సైతం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు చంద్రశేఖర్, శారద, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నుంచి పాఠశాలను మార్చొద్దని ధర్నా



ధర్నా చేస్తున్న గిరిజన కాలనీ వాసులు

గుడ్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గంధర్వ గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మరో పాఠశాలలో కలపవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక విద్యావనరుల కేంద్రం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గంధర్వ గిరిజన కాలనీ నుంచి మెయిన్ ప్రాథమిక పాఠశాల వరకు ఒకటిన్నర కిలోమీటర్ల ఉందని, దానికి తోడు రెండు ప్రధాన రహదారులను విద్యార్థులు దాటిపోవాల్సిన పరిస్థితి ఉంద న్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతా. ధికారులు కలుగజేసుకొని కాలనీ పాఠశాలను యథావిదిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, పాలకీర్తి నాగేశ్వరరావు, దామా కృష్ణయ్య, దళిత సంఘ నాయకులు మాల్యాద్రి, చెన్నయ్య, కొమరగిరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంకె పార్కు స్థలాన్ని శుభ్రం చేయాలి : సీపీఎం



మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి సెంటర్‌లో ఉన్న ఎస్ఎంకె పార్క్ కంపచెట్లు, చెత్తచెదారంతో నిండి అపరిశుభ్రంగా ఉందని, దానిని శుభ్రం చేయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని కోరారు. ఈ మేరకు సీపీఎం ఎల్ఆర్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో స్థానికులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

●ఏఎస్ పేట: ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం జరిగిందని ఏఎస్ పేట మండల సీపీఎం కమిటీ సభ్యులు బుధవారం నిరసన తెలిపారు. ఉపాధి హామీ పనులకు, విద్య, వైద్య రంగాలకు నిధులు తగ్గించడం అన్యాయం అని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊసే లేకపోయినా అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బడ్జెట్‌ను పేదలకు ఉపయోగపడేలా సవరించాలని కోరారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అశ్వత్థనారాయణ కల్యాణం

సంగం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున నాగారపమ్మ ఆలయ సమీపంలో బుధవారం అశ్వత్థనారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాగి, వేపచెట్టును విష్ణువు, లక్ష్మీదేవిగా భావించి వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

సంగం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ- క్రాప్‌తోపాటు కేవైసీ చేసుకున్న రైతుల నుంచి ఏగ్రేడ్ రకం ధాన్యం క్వింటా రూ. 2320, సాధారణ రకం ధాన్యం క్వింటా రూ. 2300 చొప్పున కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ కార్యదర్శి వెంకట రమణయ్య తెలిపారు.

ఆక్రమిత స్థలాల పరిశీలన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దక్కనూరులో ఆక్రమణకు గురైన స్థలాలను బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు పరిశీలించారు. కొంతమంది గ్రామస్థులు అందించిన ఫిర్యాదు మేరకు వీఆర్వో మనోహర్, పంచాయతీ కార్యదర్శి సుల్తాన్ గ్రామంలోని జగనన్న లేఅవుట్లలో ఆక్రమణకు గురైన ఇంటిపట్టాలు, రహదారులను సర్వేయర్ పవన్‌తో కలిసి పరిశీలించారు. ప్రజల నుంచి వివరాలు సేకరించారు. నివేదికలను తహసీల్దారుకు అందజేయనున్నట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సందర్శన

కావలిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు కే. బ్రహ్మానందం బుధవారం పట్టణ బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం ఆహ్వానం మేరకు అధికారులను గౌరవప్రదంగా కలుసుకుని, బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు చేరువ చేయడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తనను టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమించేందుకు సహకరించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని బ్రహ్మానందం పేర్కొన్నారు.

కావలిలో మెగా జాబ్ మేళా

కావలిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా జరిగింది. వివిధ కంపెనీలు నిర్వహించిన ఈ మేళాలో దాదాపు 80మంది పాల్గొనగా, 26మంది ఎంపిక అయినట్లు కళాశాల డైరెక్టర్ జానకీరామ్ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ ప్రిన్సిపాల్ పీవీ రావు, నాక్ ప్రిన్సిపాల్ రవికాంత్, ప్లేస్‌మెంట్ అధికారి మహేష్, అధ్యాపకులు కబీర్, తిరుపాల్, ప్రోగ్రాం ఆఫీసర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచర్లలో ప్రముఖులు

లింగసముద్రం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు వెంగళరావు తండ్రి కొండయ్య దశదిన కర్మ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు హాజరై, కొండయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం వీరాస్వామి, బీ ప్రసాద్, రాంబాబు, పలువురు ఇతర నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా బుధ వారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంఈవో-2 శ్రీనివాసులు, సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ తేజస్విని కార్యకర్తలకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు ఫణిరాజ్, సుబ్బారెడ్డి, సారధి తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలోని విద్యార్థినులకు ఐ స్క్రీనింగ్ నిర్వహించి, 83మందికి బుధవారం అద్దాలు పంపిణీ చేశారు. పట్టణంలోని కోటారెడ్డినగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి డాక్టరు బ్యూలాగ్రేస్ వీటిని పంపిణీ చేశారు కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

ఉదయగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తన పొలం కంచె రాళ్లను ధ్వంసం చేయడంతోపాటు తనపై దాడి చేశారని మండలంలోని అప్పసముద్రం గ్రామానికి చెందిన దగ్గుపాటి వెంగళరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొడ్డం మాలకొండారెడ్డి, మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

పీ4 సర్వేపై అవగాహన

సీతారామపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీలోని బిట్ -1 సచివాలయం వద్ద ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన బుధవారం పీ4 సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఫోర్ సర్వే ద్వారా గ్రామ పంచాయతీలో అత్యంత పేదలను గుర్తించి, వారి వివరాలు సేకరించాలని తెలిపారు.